# మరనాత మెసేంజర్

క్రైస్తవ ఆధ్యాత్మిక మాసపత్రిక

# MARANATHA MESSENGER

విడి ప్రతి
రూ.10/-

క్రైస్తవ్యము ఒక మతము కాదు
నిత్య జీవములోనికి ప్రవేశించడానికి
దేవుడు ఏర్పరచిన ఏకైక సత్య మార్గము

# CHRISTIANITY
IS NOT A
# RELIGION

**RELIGION**
IS MAN'S EFFORTS
TO REACH UP
TO GOD.

**CHRISTIANITY**
IS GOD'S EFFORT
TO REACH DOWN
TO US!

పరిశుద్ధుడైన దేవుని సన్నిధికి
(మోక్షానికి) వెళ్ళడానికి (చేరుటకు)
పాపియైన మనుష్యులు చేయు
ప్రయత్నములే మతము.

పాపులమైన మనలను రక్షించుటకు
భువిపైకి దిగిరావడానికి
పరిశుద్ధుడైన దేవుడు చేసిన
ప్రయత్నమే క్రైస్తవ్యము.

సంపుటి 37 జనవరి 2019 సంచిక 1

## ఈ సంచికలో...

1. లూకా సువార్త 31వ భాగం - శ్రీ జి. మోజెస్ చౌదరి
2. ఆధ్యాత్మిక విజ్ఞాన ధారావాహిక - డా॥ నిరీక్షణ కె. కంచర్ల
3. కాలం... ఆగదు - డా॥ కొటారి మనష్షే
4. నామట్టుకైతే... - సహోదరి ఎ. ఉషారాణి
5. ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక - 7వ భాగము - రెవ. అల్లూరి విశ్వప్రసాద్
6. హెబ్రీపత్రిక ధ్యానములు - 38 - రెవ. గొట్టిపాటి యేసుదాసు
7. వార్తల్లో కొన్ని....

ప్రధాన సంపాదకులు : శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి

సంపాదక వర్గం :

రెవ. ఫిలిప్ ప్రకాష్, రెవ.డా॥ నిరీక్షణ కంచర్ల, రెవ. జి.యం.రాజు, రెవ.జి.యేసుదాసు

మీ చందాలు, వ్యాసములు ఈ క్రింది చిరునామాకు పంపించండి

మరనాత మెసేంజర్
గాయత్రి నగర్, విజయవాడ - 520 008.
Phone : 0866 - 2480047, e-mail : mvs828@gmail.com

### ప్రకటన వివరాలు

పూర్తి పేజి : రూ. 1,500/- అరపేజి : రూ. 800/-
టైటిల్ పేజి 3 లేక 4 : పూర్తి పేజి రూ. 3,000/- అరపేజి రూ.1,500/-

| | స్వదేశములో | విదేశములో |
|---|---|---|
| సాలుసరి చందా | రూ. 150/- | రూ. 1,000/- |
| పోషక సభ్యత్వం | రూ. 1,000/- | రూ. 3,000/- |
| జీవిత సభ్యత్వం | రూ. 5,000/- | రూ. 15,000/- |

This Magazine is Printed, Published and Owned by G. Moses Choudary & Printed at Alpha & Omega Publications & Printing Works, # 59-8/1-6/3, Gayatri Nagar, Vijayawada - 520 008. This Magazine is Edited by G. Moses Choudary, # 59-8/1-6/3, Gayatri Nagar, Vijayawada - 520 008.

# లూకా సువార్త
## (31 వ భాగము)

**శ్రీ జి. మోజెస్ చౌదరి, విజయవాడ**

## మత ఛాందసులు-పరమత ద్వేషకులు : (లూకా సువార్త 7:31-35)

పాఠకులకు ప్రభువైన యేసుక్రీస్తు నామములో నూతన సంవత్సర శుభములు, ఆశీస్సులు కలుగునుగాక!

మన జీవితాన్ని ఏ అలవాట్లు, సూత్రాలు, భావాలతో కట్టుకొంటామో, ఆ జీవితమనే ఇంటిలోనే మనము నివాసం చేస్తాము. జీవితము ధన్యచరితం చేసుకోవడం మనచేతుల్లో ఎంతో ఉంది.

**"కాబట్టి యీ తరము మనుష్యులను నేను దేనితో పోల్చుదును, వారు దేనిని పోలియున్నారు? సంతవీధులలో కూర్చుండియుండి- మీకు పిల్లనగ్రోవి ఊదితిమి గాని మీరు నాట్యమాడరైతిరి; ప్రలాపించితిమి గాని మీరేడ్వరైతిరి అని యొకనితో ఒకడు చెప్పుకొని పిలుపులాటలాడుకొను పిల్లకాయలను పోలియున్నారు. బాప్తిస్మమిచ్చు యోహాను, రొట్టె తినకయు ద్రాక్షారసము త్రాగకయు వచ్చెను గనుక- వీడు దయ్యముపట్టినవాడని మీరనుచున్నారు. మనుష్యకుమారుడు తినుచును, త్రాగుచును వచ్చెను గనుక మీరు- ఇదిగో వీడు తిండిపోతును మధ్యపానియు, సుంకరులకును పాపులకును స్నేహితుడును అనుచున్నారు. అయినను జ్ఞానము జ్ఞానమని దాని సంబంధు లందరినిబట్టి తీర్పుపొందుననెను"** (లూకా-7: 31 - 35).

పైన తెలుపబడిన లేఖనభాగము ఆధారగా మత ఛాందసులు, పరమత ద్వేషకులను గూర్చి మనం చూద్దాం. వాళ్లనిగూర్చి ప్రభువైన యేసు ఈ చక్కని ఉపదేశం చెప్పాడు. ఆనాటి యూదామతంలో పరిసయ్యులు, సద్దూకయ్యులు, శాస్త్రులు అనే విభిన్న తెగలు ఉన్నారు. అందులో పరిసయ్యులను గూర్చి పరిశీలనచేద్దాము. పరిసయ్యుడు అనేమాటకు ప్రత్యేకించుకున్నవాడు అని అర్థం. అంటె తననుతాను మత వ్యవహారాలకొరకు ప్రత్యేకించు కొన్నవాడు. వీరు అంతరంగపు చైతన్యానికి ప్రాధాన్యతనిచ్చే భక్తిని కాకుండా, వీరి భక్తిని బాహ్యమైన మతాచారాలకు పరిమితం చేసినవారు. వారు చెప్పిన ఆచారవ్యవహార ఖర్మ కాండలతో భక్తి చేస్తేనే, వారి మతాచారాలకు లోబడితేనే వాళ్లు ఒప్పుకొంటారుగాని, లేకపోతే ద్వేషిస్తారు. పరమతాలను బహుగా ద్వేషించే ధోరణి కలిగినవారు. తమ మతాచారాలకు కట్టుబడనివాళ్లని వెలిచూపు చూస్తారు, విమర్శిస్తారు, కొడతారు, దాడులుచేస్తారు, చివరికి నిర్దాక్షిణ్యంగా చంపడానికికూడ వెనుకాడరు. ఆనాటి యూదామత తెగలో మత నాయకులైన పరిసయ్యులను పోలినవాళ్లు ఈ లోకంలో, మన దేశంలో నిస్సందేహంగా

ఉన్నారు. పరమతస్తుల యొక్క ఆచారాలను, అలవాట్లను ద్వేషించి వాళ్లమీద దాడులు చేసి చంపేవాళ్లని మనదేశములోనూ చూస్తున్నాం. **నైతిక విషయాలలో వీళ్లు ఏంచేస్తారంటే- ఈగలను, దోమలను ఒడియగట్టి ఒంటెల్ని, ఏనుగుల్ని దిగమింగేస్తారు. అంటే అల్పమైన వాటికి అధిక ప్రాధాన్యతనిస్తారు, అధికప్రాధాన్యత కలిగినవాటిని అల్పమైనవిగా చూస్తారు. చిన్నవాటిని పెద్దగాఎంచడం ఎంత దోషమో పెద్దవాటిని చిన్నగా ఎంచడం కూడ అంతే దోషమవుతుంది. ఈ మతఛాందసవాదులైన పరిసయ్యులకు ఉన్న జాడ్యమది. అట్టివారు ఏ మతస్తులైనప్పటికిని వారు దేవుని దృష్టిలో నిస్సందేహంగా దోషులే.**

పైన చెప్పిన తన ఉపదేశములో ప్రభువైన యేసు అటువంటివాళ్లని పిల్లకాయలుతో పోలుస్తున్నాడు. పిల్లలైనవారు మానసికంగా, ఆధ్యాత్మికంగా, నైతికంగా ఎదిగినవాళ్లుకాదు. ఆవిధంగానే పరిసయ్యులకు కూడ మత ఛాందసవాదానికి, మౌఢ్యానికి ఏమీ కొదువలేదు కాని వాళ్లు మానసికముగా ఎదిగినవాళ్లుకాదు. అందుకనే ప్రభువు వాళ్ళని పిల్లకాయలు అన్నాడు. ఆరోజుల్లో పిల్లకాయలు సంతవీధులలో చేరి ఆటలాడుకొనేవారు. ఆ ఆటలు ఏమిటంటే - పిల్లలందరూ రెండు మూడు గ్రూపులుగా విడిపోయేవారు. ఒక గ్రూపువారు పిల్లనగ్రోవులు ఊదేవారు, రెండవగ్రూపు దానికి అనుగుణంగా నాట్యమాడాలి. మరొక గ్రూపులోనివారు వాయనాలుపెట్టుకొని ఏడవాలి. వాయనాయనో, వాయయ్యో, వాయమ్మో అని ఏడుపుమొఖాలు పెట్టుకొని దుఃఖపూరిత స్వరంతో ఏడ్వాలి. అవి వాళ్ల ఆటలు. దీనిలో మనకు అర్థమయ్యేదేమంటే - ఒక గ్రూపువాళ్లు ఏంచేస్తారో వాళ్లకు అనుగుణంగా మరొక గ్రూపువాళ్లు చెయ్యకపోతే ఆ ఆటలో వీళ్లు ఓడిపోయినట్లు. పరిసయ్యులు మతాచారాలతో వాళ్లు చేస్తున్నదే భక్తి, దానికి అనుగుణంగానే అందరూ చెయ్యాలనే ఈ మతమౌఢ్యులను యేసు బహిరంగస్థలాలలో ఆటలాడుకొనే పిల్లకాయలతో పోల్చాడు. అంటే వాళ్లు చెప్పినట్లుగా దేశవాసులులందరూ చేస్తేనే ఒప్పుకొంటారు. లేకపోతే వాళ్లని ద్వేషించడం, విమర్శించడం, దాడులుచేసి కొట్టడం చివరకు చంపడం కూడా చేస్తుంటారు. ఇది వాళ్లు మానసికంగా ఎదగని ధోరణికి ప్రస్ఫుటమైన నిదర్శనం. ఇలాంటివాళ్లు మనకు కనబడుతూనేఉన్నారుకదా! వార్తల్లో చూస్తున్నాం, చదువుతున్నాం. మతం పేరుతో భక్తి పేరుతో జరిగే దాడులు, హింస, ద్వేషమును రగిలిస్తున్న వాళ్లధోరణి నిజంగా మనం గర్హించాలి, నిరసించాలి.

**ఎవరి నమ్మకాలను గూర్చి వారు చెప్పకొనే స్వేచ్ఛను మనదేశపు రాజ్యాంగము ఒక ప్రాథమిక హక్కుగా మనకు కల్పించింది. ఎవరి నమ్మకాలు వారివి. మీ నమ్మకాలు గురించి మీరు చెబుతున్నారు, మా నమ్మకాలుగూర్చి మేము చెప్పకొంటాం. చెప్పకొనే వారిని హింసించడం, దాడులు చేయడం రైటు కాదుకదా. మీరు నమ్మిన నీతిసూత్రాలను బోధించి ప్రజలలో నైతిక విలువలు పెంచేటటువంటి మీ బోధనాశైలితో దేశసేవ చెయ్యండి. అంతేకాని పరులమీద దాడులు చేయడం, నిష్ఠ నియమం కలిగి భక్తిచేసేటటువంటి వాళ్లకి లక్షణమేకాదు. అది దుర్మార్గులు, దుర్భలులయొక్క ధోరణికి నిదర్శనం కదా..!**

బాప్తిస్మమిచ్చు యోహాను గొప్ప బోధకుడు, దేశంలో గొప్ప ఆధ్యాత్మిక, నైతిక సంచలనానికి దారితీసినవాడు. అతడు ఉపవాసములుంటూ పరిమితమైన ఆహార పానీయాలు తీసుకొంటూ, సామాన్యంగా జీవిస్తూఉంటే అతనికి దయ్యంపట్టిందని అన్నారు పరిసయ్యులతెగకు చెందిన మత ఛాందసవాదులు. మరియు దైవ తనయుడైన యేసు క్రీస్తు మనుష్య కుమారుడుగా సంఘములో వెలివేయబడిన వేశ్యలు, కులీనులు, పేదలు, సుంకపుగుత్తదారులు వంటివారందరితోకలిసి వారితో నేస్తంచేస్తూ, కలసి భోజనంచేస్తూ వారి జీవితాలలో చైతన్యం తేవడంకొరకు వారికి బోధలు చెపుతూఉంటే ఇతడు తిండిపోతు, త్రాగుపోతు అని ఆయనను నిందిస్తారు. ఏదిచేస్తే తప్పో, ఏదిచేస్తే ఒప్పో ఈ మత ఛాందసులకు తెలీదు. వాళ్ల ఆచార వ్యవహార ఖర్మకాండల వ్యవస్థకు మనం కూడా బానిసలమై, వారిని అనుసరిస్తూ బ్రతికితే వాళ్ల దృష్టికి అంగీకారము పొందుతాము. లేకపోతే వాళ్ల దుర్విమర్శలు, ద్వేషభావముతో సత్యాన్ని అడ్డగిస్తూ హింసలు, దాడులు, హత్యలు కూడా చేస్తారు. ఇట్లాంటివాళ్లు మత నాయకులుగ, పెత్తనంచేసే పెద్దలుగా చెలామణి అవడం నిజంగా మానవజాతికి సిగ్గుచేటు అంటాను. వక్రవిమర్శలు చేసి వక్రభాష్యాలుచెప్పి పరమతబోధలవలన ప్రజలకు జరుగుతున్న మేలును అంగీకరించక పోగా ప్రజలను పెడదారి పట్టిస్తారు వీళ్లు. **“ఐతే, జ్ఞానము జ్ఞానము కాకపోదు, జ్ఞానము దాని సంబంధులందరిని బట్టి తీర్పు పొందుతుంది” అన్నాడు ప్రభువు.** సత్యము సత్యమని అనిపించుకోకుండా మానదు, జ్ఞానము జ్ఞానముకాకుండాను పోదు. అజ్ఞానంతోకూడిన, అస్తవ్యస్తమైన విమర్శలవల్ల జ్ఞానము జ్ఞానమనిపించుకోకుండా పోదు. సత్యము సత్యమని అనిపించుకోకుండా పోదు. ఎందుకంటే సత్యము, మార్గము, జీవమైయున్న యేసుక్రీస్తు ప్రభువు దేవుడు కాకుండా పోడు. విమర్శకుల ద్వేషపుమాటలవల్ల దేవుడు తన దైవత్వాన్ని ఎప్పుడూ పోగొట్టుకోడు, దేవునిలో ఉన్న దైవత్వపు గుణలక్షణాలు ఎప్పుడూ తరిగిపోవు.

ఈ వ్యాసం చదువుతున్న పాఠకమిత్రులారా, పరమత ద్వేషకులు మీదారిలో అడ్డువచ్చి మిమ్ములను ద్వేషించి, హింసించడానికి ప్రయత్నంచేస్తున్నారా? అయితే నమ్మిన సత్యము, మార్గము, జీవమైయున్న క్రీస్తుప్రభువు కొరకు దీక్షాదక్షతలతో పౌరుషంగా రోషంగా నిలబడ బద్ధులైయున్నాం. విమర్శ సహేతుకమైనా, దుర్హేతుకమైనా ఒకరోజున దానియొక్క ఫలము బహిర్గతమవుతుంది. అందుచేత, నాటి పరిసయ్యులను పోలినవాళ్లు పిల్లకాయలను పోలియున్నారని ప్రభువైన యేసు చెబుతున్నాడు. సత్యము, సత్యమును గూర్చిన జ్ఞానము దాని సంబంధులలో అద్భుతమైన చైతన్యం, మేలు కలుగజేస్తున్నందున కోటానుకోట్ల జీవితాలలో వెలుగులునింపే ఈ మహాదేవుడు క్రీస్తు ప్రభుని యొక్క సువార్తసందేశము ఎల్లడెలా వ్యాప్తిచేయబడుతూఉంది. ప్రభువైన యేసుక్రీస్తు, దేవుడు అని నమ్మినవారి జీవితాలలో అద్భుతమైన దీవెన సిరులు క్రుమ్మరిస్తూ ఉన్నాడు. ఈ నూతన సంవత్సరములో అట్టి ఆశీర్వాదపు సిరులను మీ కుటుంబము పొందుకోవాలని ఆకాంక్షిస్తూఉన్నాను.

**- మరనాత.**

# అభ్యర్ధన-ఆచరణ-ఆశీర్వాదము

## ఆయన (యేసు) మీతో చెప్పునది చేయుడి

డా॥ నిరీక్షణ కె. కంచర్ల
M.A., MBA., M.A., M.Div., M.Th., D.Min., (Ph.D.)
డైరెక్టర్ - మరనాత థియోలాజికల్ సెమినరి
హైదరాబాదు. సెల్ : 9849746464

## షోమ్రోను లో నయమాను

పాఠక మిత్రులకు శుభములు.

అది క్రీస్తుపూర్వం 851-841 సిరియా దేశమును బెన్హదదు - 2 పరిపాలిస్తున్న రోజుల్లో, ఇశ్రాయేలు రాజ్యమును ఆహాబు కుమారుడైన యెహోరాము (2 రాజులు 3 : 1) షోమ్రోను/ సమరయను రాజధానిగా చేసుకొని పరిపాలన చేస్తున్నాడు. దైవజనుడైన ఎలీషా ఇశ్రాయేలు రాజ్యమునకు ఆధ్యాత్మిక సలహాదారుడుగా ఉన్నాడు. ఏలికలు ఎంత గొప్పవారైనా, వారికెన్ని చాతుర్యాలున్నా, ఆధ్యాత్మికంగా వారిని నడిపించేవారు లేకపోతే దేశం అంధకారమౌతుంది. దేశాలకు భౌతిక సంపద, సంరక్షణ ఎంత ప్రాముఖ్యమో, ఆధ్యాత్మిక జీవన పరిరక్షణ కూడా అంతే ప్రాముఖ్యం. అట్టి బాధ్యతను అంత సమర్ధుడు, యోగ్యుడు కాని యెహోరాము ఏలుబడిలో ఓపికతో, వివేకంతో ఎలీషా ప్రవక్త సేవలందించాడు.

అదే కాలములో సిరియా దేశపు సైన్యాధిపతియైన నయమాను గొప్ప అధికారిగా పేర్గాంచి, వారి దేశాన్ని సమర్ధవంతంగా కాపాడుతూ తన రాజు దృష్టిలో ఘనుడై సేవలందిస్తున్నాడు. ఇంత ఉన్నత బాధ్యతలను వహిస్తూ, బహు పేరుప్రఖ్యాతులు పొందిన నయమానుకు కుష్ఠరోగమొచ్చింది. రోగాలకు / జబ్బులకు లింగబేధం, రంగుబేధం, దేశబేధం లేదుగదా! తన సేవలతో దేశాన్ని కాపాడుతున్నా, తనకు పట్టిన కుష్ఠరోగాన్నుంచి తనను తాను కాపాడుకొనలేకపోయాడు. ఇది నిజమే గదా, ఎంత హంగు, ఆర్భాటాలున్నా, అనారోగ్యాలు మనిషిని కృంగదీసి భయపెట్టినప్పుడు ఎవరుమాత్రం ఏమిచెయ్యగలరు? ఇదిలా ఉండగా, అతని యింటిలో తన భార్యకు సేవచేయటానికి ఇశ్రాయేలు దేశమునుండి ఓ చిన్నమ్మాయిని తీసుకురావటం జరిగింది. సిరియా దేశపు సైన్యము గుంపులు గుంపులుగా ఇశ్రాయేలు దేశ ఉత్తర సరిహద్దు ప్రాంతాలపై దాడిచేస్తూ, దొరికిన వారిని దొరికినట్లు బంధించి వారి దేశానికి బానిసలుగా తీసుకుపోయేవారు (2 రాజులు 5 : 2). మొత్తానికి ఆ గుంపులో ఒక ఇశ్రాయేలు దేశపు చిన్నది నయమాను యింటిలో తన భార్యకు సహాయముగా ఉండటానికి నియమించబడింది.

బానినపిల్లగా తనదిగానిదేశంలో నయమాను యింటిలో సేవచేస్తోంది. నయమానుకున్న కుష్ఠరోగాన్ని గ్రహించి, ఓరోజున సమయానుకూలంగా స్పందించి

"...షోమ్రోనులోనున్న ప్రవక్త దగ్గర నాయేలినవాడుండవలెనని నేనెంతో కోరుతున్నాను; అతడు నా యేలినవానికి కలిగిన కుష్ఠరోగమును బాగుచేయునని తన యజమానురాలితో అనెను" (2 రాజులు 5 : 3). ఇది నిజముగా గొప్ప సందర్భము. వయస్సులో చిన్నదైనా, ఆధ్యాత్మికంగా ఎంత పెద్దదో గదా! స్వదేశంలోనైనా, పరదేశంలోనైనా సమయం, సందర్భం వచ్చినప్పుడు దేవుని గూర్చి తెలియచేయటం ఏ కొందరికో సాధ్యమయ్యే అంశం. పైగా నయమాను ఒకరకంగా తనకు విరోధి. తనను తన మాతృదేశం నుండి, తల్లిదండ్రుల దగ్గర నుండి బలవంతంగా ఎత్తుకొచ్చి పనిచేయించుకుంటున్నారు. అలాంటప్పుడు నయమానుకు ఏ రోగమొస్తే ఏంటి? వాళ్ళు నాశనమైతే నాకేంటి?? ఇది మామూలు ఆలోచన కాని, ఆ ఇశ్రాయేలు దేశపు చిన్నది, వయస్సులో చిన్నదేగాని, అవగాహనతో, ఆధ్యాత్మికతలో, నిస్వార్ధ ప్రేమలో చాలా చాలా పెద్దది. ఇదే ఆమెకున్న గుణసౌందర్యం. నిస్వార్ధ దైవప్రేమికులు మాత్రమే చేయగలిగిన గొప్ప సేవ. ఆ చిన్నదానిలోని పరోపకార బుద్ధి దేశ సరిహద్దులను దాటి, ఎవ్వరూ చేరుకోలేని దూరాలకు చేరింది?? వయస్సులో చిన్నది, బుద్ధిలో పెద్దది... !!!

ఈ రోజుల్లో అయినవాళ్ళకు, తోడబుట్టిన వాళ్ళకు సహాయం చేయటం, మాట సహాయం చెయ్యటం కూడా కష్టమైపోతోంది గదా! కొందరికి కారణాలు వేరుగా ఉండొచ్చు, అయితే నిజమైన ఆధ్యాత్మికవాదులు ఎల్లలులేని పరోపకార బుద్ధిని, నిస్వార్ధ ప్రేమ త్యాగాలను ప్రజలకు పంచగలరు. ఇలాంటి వాళ్ళే భావ పరిపక్వత కలిగినవాళ్ళు. అంతేగాని ఎంతసేపు నేనూ.. నా కుటుంబం అనుకుంటూ చేయవలసిన పనులను, తెలుపవలసిన దైవ సమాచారమును, తెలియచేయవలసిన పద్ధతిలో తెలుపకుండటం అనాధ్యాత్మికం. దశాబ్దాలుగా దేవుని భక్తులుగా, సేవకులుగా ఆయా సంఘాలలో చెలామణౌతున్నా, ప్రభువు కొరకు సందర్భానుసారంగా, ప్రజలను ఒప్పించే రీతిలో, ఒక సాక్ష్యం, వాక్యం చెప్పటం చేతగానివారు ఈరోజుల్లో చాలామంది ఉన్నారు. నిజమైన ప్రభు భక్తులు ప్రజలను దేవుని దగ్గరకు, మరియు యోగ్యులైన దైవసేవకుల దగ్గరకు / సంఘాలకు నడిపించాలి. అక్కడ శారీరక, మానసిక స్వస్థతలు ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతాయి.

మరో సంగతేమిటంటే, ఆ ఇశ్రాయేలు చిన్నది తనకు తెలిసిన దైవజనుడైన ఎలీషాను, సిరియా దేశం తీసుకురమ్మని చెప్పటంలేదు. నయమానే ఇశ్రాయేలు దేశం వెళ్ళాలి. ఇందులో జ్ఞానమున్నది. ఆనాడు పొరుగు దేశాలైన సిరియా, ఇశ్రాయేలుల మధ్య యుద్ధ వాతావరణమున్నది. అట్టి సమయంలో దైవప్రవక్తలు దేశ సరిహద్దులు దాటటం కష్టం. పైగా దేవుని సన్నిధికి రాగలిగిన అవకాశం, ఆరోగ్యం ఉన్నవారు రావాలని, తద్వారా, అట్టివారికి దేవుడు మేలు చేస్తాడని ఆచిన్నది గొప్పగా ఆలోచనచేసి తన యజమానుడైన నయమానును ఎలీషా దగ్గరకు వెళ్ళాలనికోరింది. ఇది ఆమె ఉన్నత భావసరళికి, పరిపక్వతకు నిదర్శనం. కనుక వీలునుబట్టి ప్రజలను, ప్రభు భక్తులు ప్రార్ధన మందిరాలకు నడిపించటం ఉత్తమం. అక్కడ దేవుడు తన దాసుల ప్రార్ధనల ద్వారా అద్భుతాలు చేస్తాడు.

మరొక విశేషమేమిటంటే, సిరియా సైన్యాధిపతియైన నయమాను, ఈచిన్నది చెప్పిన

మాట విని ఇశ్రాయేలు దేశపు ప్రవక్తయైన ఎలీషా దగ్గరకు వచ్చే ప్రయాణానికి శ్రీకారం చుట్టాడు. సిరియా దేశము నుండి ఇశ్రాయేలు దేశములోని సమరయ ప్రాంతానికి 651 కిలోమీటర్ల దూరం. ఆరోజుల్లో అంతదూరం ప్రయాణం చేసి దైవజనుడైన ఎలీషాను కలుసుకోవటం విశేషం. అంటే ఓ ఉన్నతమైన మనిషిని ఒప్పించి ప్రభుపాదసన్నిధికి ఆచిన్నది నడిపించింది. ఇది గొప్ప సందర్భం. సామాన్యులను, సామంతులను ప్రభువు దగ్గరకు నడిపించాలి. ఇది ప్రతి సంఘ దర్శనమైయుండాలి. ఎంతసేపూ పేద, సాదలకు సేవచేయటం మాత్రమే గాక, సమాజములో క్రీస్తుప్రభువును సరిగా అవగాహన చేసుకోని వారిని గుర్తించి, ప్రేమతో, వివేకంతో ఇశ్రాయేలు చిన్నది సువార్త చెప్పి, ఒప్పించినట్లు మనమునూ చెయ్యాలి. పదేపదే చెప్పినవారికి చెబుతూ ప్రభువులో వారిని పెంచటం ఎంత ప్రాముఖ్యమో, అసలు సరియైన ఆధ్యాత్మిక ఆహారం లేక అలమటిస్తున్న ఆధ్యాత్మిక పేదలకు సమయస్ఫూర్తితో ప్రభుసందేశాలందించటం వివేకం, విజ్ఞత.

నయమాను మర్యాదపూర్వకంగా ఇశ్రాయేలు రాజును మొదటిగా కలిసి, తన సిరియా రాజు యిచ్చిన సిఫారసు ఉత్తరాన్నందించాడు. యెహోరాము ఉక్కిరిబిక్కిరయ్యాడు. నేను కుష్ఠరోగాన్ని నయం చేయటమేమిటి? దీనివెనుకేదో కుట్ర ఉన్నదని భావించి బట్టలు చింపుకొని మరీ బాధపడ్డాడు. అవును రాజులైనా, ఘనులైనా కొంతవరకు కొంతసహాయం చెయ్యగలరు గాని, స్వస్థతలను కలిగించటం వారికి చేతగాదు. అందుకే యెహోరాము నేను దేవుడనా? అన్నాడు. రాజు గలిబిలయ్యాడు. పేరుకు రాజులు, మేధావులు మరియు గొప్పవాళ్ళైకాని కొన్ని సంక్లిష్ట సందర్భాల్లో ఏమిచెయ్యాలో, ఎలా మాట్లాడాలో, ఎలా ప్రతికూలతను సమర్ధించుకోవాలో చాలామందికి తెలియదు. అందుకే అందరికి దేవుని సహాయం అవసరం.

ఆ సంగతి ఎలీషాకు తెలిసి, ఎలీషా రాజుతో సరేగాని "నీ వస్త్రములు నీవెందుకు చింపుకొంటివి? ఇశ్రాయేలులో ప్రవక్త ఉన్నాడని అతనికి తెలియబడునట్లు ఆతని నాయొద్దకు రానిమ్ము"... (2 రాజులు 5 : 7,8). అసలు ఇశ్రాయేలు చిన్నది నాయజమానుడు ఇశ్రాయేలు దేశములోని షోమ్రోనులోనున్న ప్రవక్త దగ్గరకు వెళ్ళమని చెబితే, నయమాను మర్యాదచొప్పున రాజు దగ్గరకు వెళ్ళాడు. ఎప్పుడు ఎవరిదగ్గరకు వెళ్ళాలో తెలుసుకోవాలి. అంతేగాని నాయకులనబడిన వారిదగ్గరకు, ప్రసంగీకులనబడిన వారిదగ్గరకు వెళ్ళి గోడుచెప్పుకుంటే ప్రయోజనం లేదు. ఎందుకంటె వారికి ఏమి తెలియదు. తెలుసుకోవాలని, నేర్చుకోవాలని వారనుకోవటంలేదు. కనుక సమర్థులైన నాయకులను, వారు సొమ్మునివ్వలేకపోయినా, అంతకు మించి చక్కటి సలహాలు, సూచనలిచ్చేవారిని ఆశ్రయించటం మేలు. చేతకాని యెహోరాముల చుట్టూ తిరగటం శుద్ధ దండగ.

మొత్తానికి కాస్త అటుఇటు తిరిగి ఎలీషా దర్శనం కోసం నయమాను బహుశ గిల్గాలులో ఉన్న ఎలీషా దగ్గరకు వచ్చాడు (2 రాజులు 4 : 38). లేదా షోమ్రోనులోనున్న ఎలీషా యింటికి వచ్చాడు (2 రాజులు 6 : 32). ఇక్కడో సంగతిని గ్రహించాలి. బహు కచ్చితత్వము గల ఎలీషా దేవుని ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించేవాడు. సిరియా దేశపు సైన్యాధిపతి

వస్తే, సహజంగా ఎన్నో మర్యాదలు పాటించాలి. అలా అట్టివారిని గౌరవించటం తప్పుకాదు. గాని ఈ సందర్భములో దైవాదేశానుసారం ఎలీషా నడుచుకోవటం అద్భుతం. దేవుడు చెప్పినట్లుగానే సేవ చేయాలిగాని, అన్నిసార్లు మనుష్యుల మనోభావాలను తృప్తిపరచి, వారేది కోరుకుంటున్నారో వాటిని గుర్తించి అందిచటం సేవకాదు. కొన్నిసార్లు ఆమోదయోగ్య మైన సూచనలు, అభిరుచులను గుర్తించి జరిగించటం సమంజసమే. అవి కూడా వాక్యాను కూలంగా ఉండాలి. వాటిని మినహాయించి ప్రజలను సంతోషపెట్టటానికి సభలలో, సంఘాలలో రకరకాలైన అనవసర డాంభిక కార్యక్రమాలు వ్యర్థం. మనుష్యులకు మనో రంజకమైన కార్యక్రమాలు ఏర్పాటు చేయటంకంటే, దేవుని సంతోషపెట్టే కార్యక్రమాలే గొప్పవి. కనుక దేవుని పేరుతో జరిగే ప్రతి కార్యక్రమును లేఖనములతో సమన్వయపరచాలి.

ఎప్పుడైతే ఎలీషా, నయమాను తలంచినట్లు సేవలందించలేదో ఆగ్రహోదగ్రుడయ్యాడు (2 రాజులు 5 : 10, 11). ఒకవేళ నయమాను ఎలీషాను గిల్గాలులో కలుసుకుని ఉంటే, అక్కడనుండి యొర్దాను నదికి షుమారు 100 కిలోమీటర్లలోపు లేదా షోమ్రోనులో కలుసుకొనుంటే 100 కి.మీ. పైచిలుకు. ఏది ఏమైనా యొర్దాను నదిలో 7మార్లు మునిగి లేవమని ఎలీషా శిష్యునితో కబురు పంపించాడు. ఇది నయమాను అసహనానికి కారణ మయ్యింది. తన దేశములోని నదులైన అబానాయును, ఫర్పరును కూడా గొప్పనదులని అయినా దైవజనుడు బయటకు రాకుండా, తన చెయ్యిని రోగముగా ఉన్నచోట ఆడించ కుండా నదిలో మునగమని చెప్పిన సంగతిని అంగీకరించలేకపోయాడు. దేవుడు మన మనుకున్నట్లుగా అన్నిమార్లు అద్భుతాలు, సహాయం చెయ్యడు. దేవుడు చెప్పినట్లుగా చేస్తేనే విజయాలు వరిస్తాయి. దేవుని చిత్తమునకు మనము లోబడాలి గాని, మనం అనుకున్నట్లు అన్నిమార్లు దేవుడు జరిగించాలిన కోరుకోరాదు. దేవుడు తన ప్రజలకు ఎల్లప్పుడు మేలైనదానినే జరిగిస్తాడు.

2 రాజులు 5 : 13 - తన దాసులలో ఒకడు నయమానును ఒప్పించాడు. ఇంతకంటె గొప్పపని ప్రవక్త చేయమంటే చేసేవారు కదా! ఇది చిన్న పని, చేస్తే బాగుంటుందని, స్వస్థత వస్తుందని చెప్పి ఒప్పించాడు. ఇలాంటి యోగ్యులైన దాసులు, ఆలోచనాపరులు నయమానుకు ఉండటం దీవెన. అనవసర ఆలోచనలతో తమ నాయకులను గలిబిలిచేసి, తప్పుదోవ పట్టించేవారు అనేకులు ఈనాడు ఉన్నారు. అయితే అలాకాకుండా విజ్ఞతతో సలహాలిస్తూ నడిపించేవారుండటం దీవెన. చివరికి ఒప్పించబడి యొర్దాను నదిలో 7మార్లు మునిగి శుద్ధుడయ్యాడు (2 రాజులు 5 : 14). ఇక్కడో సంగతిని గ్రహించాలి - యొర్దాను నదీజలానికి స్వస్థతనిచ్చే శక్తిలేదు. అది ఒక సూచన మాత్రమే. ఇక్కడ నయమాను దేవుని చిత్తమునకు లోబడుటయే ప్రధానం..!

2 రాజులు 5 : 15 - నయమాను స్వస్థతనొంది తన పొరపాటును గుర్తించి వినయంగా ప్రవక్తదగ్గరకు వచ్చి తాను తెచ్చిన బహుమానమును స్వీకరించమని ప్రాధేయపడ్డాడు. ఆశ్చర్యమేమిటంటే నయమాను తనతో 20 మణుగుల వెండి, లక్షా ఇరువైవేల రూపాయల బంగారము, మరియు పదిజతల బట్టలు తెచ్చాడు. ప్రస్తుతము వీటి విలువ మన

రూపాయల్లో చూస్తే షుమారు 70 లక్షలు... ??? చాలా ఆశ్చర్యం. అంత పెద్ద సొమ్మును దైవాదేశానుసారంగా ఎలీషా సున్నితంగా తిరస్కరించాడు. ఆయనకు సొమ్ము అవసరత లేనందునకాదు. దేవుడు ఆసందర్భములో వద్దని చెప్పినందున ఎలీషా విధేయుడయ్యాడు. ఇది ఎలీషా నిబద్ధతకు నిదర్శనం. నయమాను ఎలీషాదీవెనలొందుకొని సంతోషంగా తన దేశానికి తిరిగి పయనమయ్యాడు. మనము గ్రహించవలసిన విషయమేమనగా, దేవుని ఆజ్ఞలను పాటిస్తూ భక్తులు, ప్రవక్తలు ముందుకు సాగాలి. దేవుడిచ్చిన జ్ఞానంతో, ఆత్మ నడిపింపుతో కొనసాగటం ముఖ్యం.

ఈరోజుల్లో చాలామంది, వారివారి ఆర్థిక స్థితిగతులను ఆధారం చేసుకొని, అనగా సంపన్నులైతే వారికి తోచినట్లు భక్తిని చేస్తూ విలువైన సంగతులు వారి జీవితాల్లో జరుగ కుండ తమంతటా తామే అడ్డుకుంటున్నారు. నయమాను స్వస్థత పొందినా ఇంకాస్త ముందు అద్భుతం జరిగిఉండేది. అతడు మధ్యలో తటపటాయించటం, అభ్యంతరపడటం అనే అంశాలు అతని స్వస్థతను ఆలస్యం చేశాయి.

నయమాను దైవప్రతినిధియైన ఎలీషాను అభ్యర్థించాడు, కాస్త ఆలస్యంగానైనా ఆచరించాడు, ఆశీర్వాదం పొందాడు. అనవసర సంశయాలు, ఆలోచనలు మరియు ప్రణాళికలు కట్టిపెట్టి అవసరమైన విశ్వాసమును ధరించి దేవునినుండి మేలులు పొందుదాం. ఇశ్రాయేలు చిన్నది చేసిన గొప్పసేవ వలన ప్రభావితం చేయబడి ప్రపంచ సేవకులుగా కొనసాగుదాం. దేవుని నమ్ముకొని ఎన్ని భౌతిక దీవెనలు అనగా సంపద ఎంత పెంచుకున్నామనుకునే దానికంటే ఎంతమందిని ప్రభువు దగ్గరకు నడిపించి స్థిరపరచామనేదే అత్యంత ప్రాముఖ్యం. అదే పరలోకంలో ఆస్థిని కూర్చుకోవటమంటే (మత్తయి 6 : 20).

**( సశేషం )**


## సంగీత, సాహిత్య ప్రియులకు ప్రకటన

**డా॥ నిరీక్షణ కె. కంచర్ల గారి కలం నుండి వెలువడిన, నిరీక్షణ మెలోడీస్ సమర్పణలో వాల్యూం-3 ఆత్మాంజలి గీతమాలికను** మరనాత విశ్వాస సమాజం, వ్యవస్థాపక **అధ్యక్షులు మాన్యశ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారి ఆశీస్సులతో డిశంబరు 25 న హైదరాబాదులోనూ, డిశంబరు 31 న విజయవాడలోనూ ఆవిష్కరించటమైనది. అందులో ఆత్మాంజలి పాటలతోపాటు,** యింతకు ముందు మేము రూపొందించిన **హృదయాంజలి, స్తోత్రాంజలి గీతమాలికలు** మరియు **మాన్యశ్రీ మోజెస్ చౌదరి గారి ప్రసంగాలు, డా॥ నిరీక్షణ కె. కంచర్ల గారి ప్రసంగాలు** అందించటమైనది. **ఈసారి ప్రజల సౌకర్యార్థం 16 జి.బి. పెన్‌డ్రైవ్‌లో పైన ప్రస్తావించిన పాటలు, ప్రసంగాలు పొందుపరచాము. కావలసినవారు ఈ క్రింది అడ్రసుకు సంప్రదించవలసినదిగా మనవి. మీ పూర్తి అడ్రస్సు, ఫోన్ నెంబరుతో రూ.500/-లు పంపి కొరియర్ ద్వారా పొందగలరు.**

**-: BANK DETAILS :-**
**Maranatha Visvasa Samajam**
**SB. A/c.No.10932011013854**
**IFSC : ORBC0101093**
**Ameerpet, Hyderabad - 16.**




**డా॥ నిరీక్షణ కె. కంచర్ల**
**మరనాత గ్రౌండ్స్, 12-7-133/81/2/1**
**రాఘవేంద్ర నగర్, కుకట్‌పల్లి**
**హైదరాబాదు-500 072.**
**సెల్ : 98497 46464**

# కాలం... ఆగదు !

**డా॥ కొటారి మనష్షే, గుంటూరు**

పాఠకులకు నూతన సంవత్సర శుభములు.

**కాలం** ఎవరికోసం ఆగదు. కాలం ముందుకు సాగిపోతుంది. ఎన్నడూ వెనక్కి రాదు. కాలాన్ని మనం కొనలేము కానీ జాగ్రత్తగా వాడుకోగలం. కాలం అత్యంత విలువైనది. వెల కట్టలేనిది. ప్రపంచంలో ఉన్న డబ్బు అంతా ఖర్చుపెట్టి ఒక్క గతించిపోయిన క్షణాన్ని మనం కొనలేము. కాలాన్ని మనం వినియోగించుకోలేకపోతే కాలం తన ప్రభావానికి మనల్ని ఆహుతి చేసుకుంటుంది. చరిత్ర సృష్టించిన మహానుభావులందరు కాలాన్ని సమర్ధవంతంగా ఉపయోగించుకున్నవారే. కాలాన్ని మనం వృధాచేస్తే జీవితం వ్యర్ధమై కాలప్రవాహంలో కొట్టుకుపోతాము.

కాలానికి రూపము లేదు, పేరు మాత్రం ఉంది. సంవత్సరం అనీ, నెల అనీ, రోజనీ, పగలనీ, రాత్రని, ఋతువని ముద్దుపేర్లతో పిలుచుకుంటామేగానీ కాలాన్ని ఎవరు చూడ లేదు. సృష్టితో ఆరంభమై భూమి ఆయుష్షును పెంచుతూ విశ్వంతో సహజీవనం చేస్తుంది కాలం. కాలం ప్రాణులన్నిటికి జీవన సదుపాయాన్ని కల్గిస్తూ జీవించడానికి అవకాశం కల్పిస్తూ సృష్టితో కూడా దొర్లిపోతూ ఉంటుంది. మానవ జీవితానికి కాలం ఒక అవకాశ ప్రవాహం. కాలాన్ని గూర్చి ఒక ఖచ్చితమైన ప్రణాళిక ఉండాలి. "నిన్న" అన్నది మళ్లీ రాదు. "రేపు" అన్నది ఇంకా పుట్టలేదు. "నేడు" అనే పరిధిలోనే మన త్రోవను సరాళం చేసుకోవాలి, సద్వినియోగం చేసుకోవాలి. కాలాన్ని ఎంత తెలివిగా జాగ్రత్తగా ఉపయోగించుకోవాలో తెలిపే చిన్న సంఘటన..

ఐస్‌లాండ్ దేశంలో ఒక రైతు ఉండేవాడు. అతనికి కొంత పొలం, జంతువులు ఉండేవి. వయస్సు పెరగటం వలన వాటిని సంరక్షించలేక ఒక యువకుడికి తన పనిని అప్పగించాలనుకున్నాడు. పత్రికా ప్రకటన విడుదల చేశాడు కానీ ఎవ్వరూ ఆసక్తి చూపలేదు. ఎందుకంటే ఐస్‌లాండ్ తీవ్రమైన చలి ప్రాంతం. అకస్మాత్తుగా పెనుగాలులు విరుచుకు పడతాయి. అలాంటి భయానకమైన వాతావరణంలో పనిచేయడానికి ఎవరు మాత్రం ఇష్టపడతారు? ఐతే కొన్ని రోజుల తర్వాత కెవిన్ అనే యువకుడు ఆ రైతుని కలిసి "నాకు ఉద్యోగ అవకాశం కల్పించండి, నేను మీ పొలాన్ని, జంతువులని, పక్షులని జాగ్రత్తగా చూసుకుంటాను" అన్నాడు. అప్పుడు ఆ రైతు కెవిన్‌ని అడిగాడు, "పెనుగాలులు వచ్చి నప్పుడు ఏం చేస్తావు? అని. కెవిన్ ఒక వింత సమాధానం చెప్పాడు, "భీకరమైన గాలి వీచి నప్పుడు నేను హాయిగా నిద్రపోతాను" అన్నాడు. రైతు ఆశ్చర్యపోయాడు. మరుసటి రోజు నుండి కెవిన్ తన పని ప్రారంభించాడు. అతని పనితనాన్ని చూచిన యజమాని చాలా సంతోషించాడు. రోజులు గడుస్తున్నాయి. ఒకరోజు తీవ్రమైన చలిగాలులు విజృంభిస్తున్నాయి. వెంటనే రైతు తన పొలం వద్దకు పరుగుతీశాడు. "కెవిన్ కెవిన్" అని కేకలు వేస్తున్నాడు.

కానీ అతను పలకలేదు. కెవిన్ కోసం వెతికే క్రమంలో అతను తన పొలానికి సమీపంలో ఒక చిన్న గదిలో నిద్రపోవడం గమనించాడు. చాలా కోపంగా కెవిన్‌మీద అరిచాడు, “నిద్ర లెగువు, గాలి చెలరేగుతుంది” అని. కాని కెవిన్ మాత్రం “నేను ముందే చెప్పాను కదా? గాలులు వీచినప్పుడు హాయిగా నిద్రపోతాను” అని చెప్పి, అటువైపు తిరిగి నిద్రపోయాడు. రైతుకి కోపం కట్టలు తెంచుకొని కెవిన్‌ని కొట్టబోయాడు. ఈలోపు తన పొలం ఏమైందో, జంతువులు ఎలా ఉన్నాయో అని పొలం వద్దకు పరిగెత్తాడు. అక్కడ పరిస్థితి చూచి నిర్ఘాంతపోయాడు. ధాన్యం అంతా చక్కగా కప్పబడి ఉంది. జంతువులన్ని త్రాళ్లతో కట్టబడి ఉన్నాయి. పక్షులన్ని పంజరంలో పెట్టి భద్రంచేసి ఉన్నాయి. మెయిన్ గేట్ తాళం వేసి ఉంది. ఎంత పెనుగాలి వీచినా ఎటువంటి ప్రమాదం జరిగే అవకాశం లేకుండా కెవిన్ తన పని పూర్తి చేశాడు. వెంటనే ఆ రైతుకి కెవిన్ మాటలు గుర్తొచ్చాయి. “భీకరమైన గాలి వీచినప్పుడు నేను హాయిగా నిద్రపోతాను”. సిగ్గుతో తల దించుకొని వెళ్లిపోయాడు.

ప్రియ పాఠకులారా! ఏమనిపిస్తుంది, కెవిన్ తన ముందున్న కాలాన్ని ఎంత జాగ్రత్తగా వాడుకున్నాడో కదా!! సిద్ధపాటు, ముందుచూపు, క్రమశిక్షణ కలిగి గాలి వీచేలోపు, నష్టం జరిగేలోపు, ప్రమాదం రాకముందే తన పనిని ముగించి సురక్షితంగా ఉన్నాడు. జీవితం కూడా అంతే! భవిష్యత్తులో జీవితంలో ఎదురయ్యే తుఫానులు, పెనుగాలులు తట్టుకోవా లంటే నీ ప్రస్తుత కాలాన్ని జాగ్రత్తగా వాడుకొని శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా, ఆర్థికంగా బలమైన పునాదులమీద నీ జీవితాన్ని నిర్మించుకోవాలి. టైం పాస్ చేస్తున్నావా? జాగ్రత్త. జీవితమనే పరీక్షలో ‘పాస్’ అవ్వలేవు, ఓడిపోతావు, ఓటమి బాధ భరించలేవు.

డబ్బు కన్నా విలువైనది సమయం. మనిషి చేసే అతి పెద్ద తప్పు “ఇంకా సమయం ఉందిలే” అని కాలాన్ని వృధా చెయ్యడం. డబ్బుని భద్రంగా దాచిపెట్టుకుంటాము, మరి కాలాన్ని ఎందుకు విలువగా ఎంచటం లేదు?? ఒక సంవత్సరం విలువ నీకు తెలియాలంటే పరీక్షలో తప్పిన విద్యార్థిని అడుగు మళ్ళీ అదే క్లాసులో కూర్చుంటే ఎంత బాధో! నెల విలువ తెలియాలంటే ఆసుపత్రికి వెళ్లి నెలలు నిండకముందే పుట్టిన బిడ్డ బాధను చూడు. ఒక వారం విలువ తెలియాలంటే వీక్లీ మ్యాగజైన్ నడుపుతూ నష్టపోయిన ఎడిటర్‌ని అడుగు. ఒకరోజు విలువ తెలియాలంటే రోజువారీ పనిచేసే కార్మికుడిని అడుగు, ఆరోజు పని చేస్తేనే డబ్బు. ఆ డబ్బుతోనే ఆరోజుకి సరిపడా పోషణ. ఒక గంట విలువ తెలియాలంటే హాస్పిటల్‌లో ప్రాణాపాయస్థితిలో ఉన్న వ్యక్తికి వైద్యమందిస్తున్న డాక్టర్‌ని అడుగు, ఆ గంట ఎంత ముఖ్యమైనదో!! (Golden hour). ఒక్క నిమిషం విలువ తెలియాలంటే ఒక్క నిమిషం ఆలస్యమై ట్రైన్ లేదా బస్ మిస్ అయినవారిని అడుగు. ఒక్క సెకెండ్ విలువ తెలియాలంటే రెప్పపాటులో రోడ్డు ప్రమాదం నుండి బయటపడినవారిని అడుగు. ఒక్క మిల్లీ సెకెండ్ విలువ తెలియాలంటే ఒలంపిక్‌లో 4వ స్థానంలో నిలిచినవాడి బాధ చూడు. రాత్రికి రాత్రే సెలబ్రిటీ అయ్యే అవకాశం కోల్పోయినట్టే. మరలా ఆ అవకాశం కోసం నాలుగు సంవత్సరాలు ఎదురుచూడాలి.

కాలంయొక్క ప్రతి అణువు విలువైనది, మంచిది. కాలం అనే బ్యాంక్ నీ జీవితపు అకౌంట్‌లో ప్రతిరోజు 86,400 సెకన్లు డిపాజిట్ చేస్తుంది. వాటిని ఎలా ఉపయోగించు కుంటున్నావు?? ఎంత సమయం వృధా చేస్తున్నావు? ఆలోచించు. నువ్వు చూస్తున్న సినిమాలు, ఉపయోగంలేని రియాల్టీ షోలు దేనికి ఉపయోగం? మనస్సులు పాడుచేసి మనుష్యుల్ని పాడుచేయటానికే!! జ్ఞానం సంపాదించుకో! పుస్తకాలలో పాఠాలతోపాటు జీవిత పాఠాలు నేర్చుకో, తరగతిలో పాఠాలను అర్థం చేసుకున్నట్టే మనుషుల్ని మనసుల్ని సమాజాన్ని అర్థం చేసుకో. కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించు. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఫిట్‌నెస్ పెంచుకో (Physical, Mental, Spiritual Fitness). ‘‘లుక్ కల్చర్’’ పెరిగిపోతుంది. టీ.వి., గూగుల్, యూట్యూబ్ చూడటం తగ్గించు. ‘‘బుక్ కల్చర్’’ (Book Culture) అలవాటు చేసుకో. గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదువు, స్ఫూర్తి పొందు. పరిశుద్ధ గ్రంథం చదువు, అందులోని మాటలు నీ జీవితాన్ని నడిపిస్తాయి.

కాలాన్ని వినియోగించుకోవడంలో కొన్ని విషయాలు పాటించాలి.

1) **కాలం ఒక కానుక** - కృతజ్ఞతతో అంగీకరించు
2) **కాలం ఒక అవకాశం** - శ్రద్ధతో వినియోగించుకో
3) **కాలం ఒక శక్తి** - జ్ఞానోచితంగా అన్వయించుకో
4) **కాలం ఒక త్రోవ** - గమ్యస్థానాన్ని నిర్దేశించుకొని పయనించు
5) **కాలం ఒక పొలం** - చెమటోడ్చి సాగుచేసుకొని సుఖించు
6) **కాలం ఒక పంట** - పుష్కలంగా నీ జీవితమనే పొలంలోకి మళ్లించుకో
7) **కాలం ఒక కోతకాలం** - గింజలు చెదరిపోనీయక గాదెల కెక్కించు
8) **కాలం ఒక త్రాసు** - చేసే ప్రతిదానికి విలువకట్టే దేవుడున్నాడని మరువకు
9) **కాలం ఒక సత్రము** - నిలువరమైన కాపురం ఇక్కడ లేదని జ్ఞాపకముంచుకో
10) **కాలం ఒక దేవాలయం** - దేవుని ఆరాధనయే కాలం తొడుక్కునే కిరీటం

ఎవరైనా చనిపోతే చచ్చిపోయాడు అంటాం. దేహం మట్టిలో కలిసిపోతుంది. మరి పోయాడు అంటే ఎక్కడికి వెళ్ళినట్టు? దేహం మరణించి మట్టిలో కలిసిపోతుంది కానీ ఆత్మకి చావులేదు. ఆత్మ ఎక్కడికో వెళ్లిందని అర్థం. మనం శరీరంతో జీవించినంత కాలం ఎలా బ్రతికాము అనే దానిపై మన ఆత్మయొక్క స్థితి ఉంటుంది.

ప్రియమైన పాఠక మిత్రులారా, మన జీవితాలలో సంవత్సరములు దొర్లిపోతూ ఉండగా నేటివరకు కాలాన్ని ఎలా వినియోగించామని ప్రశ్నించుకుందాం. హృదయపూర్తిగా చెమటోడ్చి శ్రమించిన వాడు జీవితమార్గములో అడ్డొచ్చే ముళ్ల తుప్పలు, అడ్డుబండలు ‘శ్రమ’ అనే అగ్నిధాటికి కరిగిపోతాయి. అప్పుడే మనం ఉన్నతమైన మార్గాలలో ప్రయాణించగలం. కాలం, జీవితం గొప్ప గురువులు. జీవితం కాలాన్ని ఎలా వాడుకోవాలో నేర్పిస్తే, కాలం జీవితం యొక్క విలువ తెలియజేస్తుంది.

**- మరనాథ.**

# నామట్టుకైతే...

**సహోదరి ఎ. ఉషారాణి, అధ్యాపకురాలు, మరనాత బిబ్లికల్ సెమినరి, విజయవాడ**

ప్రభువైన క్రీస్తు నామమున మరనాత మెసెంజర్ పాఠకులకు శుభములు. యేసుక్రీస్తును రక్షకునిగా స్వీకరించి, ఆయనను వెంబడించుటయే జీవితము యొక్క గొప్ప లక్ష్యము. యేసును వెంబడించుట అనేది చాలా గొప్ప విషయము. అనగా మన జీవితాలను క్రీస్తు కొరకు అర్పించి వెంబడించాలి. అందును గూర్చి యేసుక్రీస్తు ఈవిధంగా తెలియచేశారు. "తన ప్రాణమును రక్షించుకొనగోరువాడు దాని పోగొట్టుకొనును. నా నిమిత్తమును సువార్త నిమిత్తమును తన ప్రాణమును పోగొట్టుకొనువాడు దాని రక్షించుకొనును" (మార్కు 8 : 35). మన ప్రాణములను దేవునికి అర్పించి, దానిని సంపాదించుకొనే వారిగా ఉంటేనే మనము దేవునిని వెంబడించగలము. దేవునిని వెంబడించుట వెనుక ఉండవలసిన లక్షణములను గూర్చి పరిశుద్ధ లేఖనాలలో వ్రాయబడ్డాయి. మనము కలిగియుండవలసిన లక్షణములు ఏమనగా,

**1. అందుబాటు (1 సమూయేలు 12 : 23) :** "నామట్టుకు నేను మీ నిమిత్తము ప్రార్థన చేయుట మానుటవలన యెహోవాకు విరోధముగా పాపము చేసినవాడనగుదును".

ఇశ్రాయేలీయులకు న్యాయాధిపతిగా, ప్రవక్తగా, సమూయేలు పనిచేశాడు. బాల్య దినములనుండే సేవకు సమర్పించుకొని దేవుని పరిచర్యను చేశాడు. బాధ్యతాయుతమైన వ్యక్తిగా ప్రజల మన్ననలు పొందుకొంటూ గొప్ప నాయకునిగా ఎదిగాడు.

దేవుని యందు భయభక్తులు కలిగి ఎటువంటి దైవ వ్యతిరేక కార్యకలాపాలకు తావులేకుండా, మనుష్యులవైపు, ధనమువైపు చూడకుండా ఖచ్చితంగా ఇచ్చిన బాధ్యతలను నెరవేర్చాడు. దేవుని మాటయందు శ్రద్ధ నిలుపుతు, దైవిక కార్యాలను నెరవేర్చాడు. తాను ఉన్న స్థానం యొక్క విలువను, నెరవేర్చవలసిన బాధ్యతలు ఎరిగిన వ్యక్తి. ఎదుటివారి పాపాన్ని ఖండించడంలో దిట్ట. అలాంటి వ్యక్తి ఒక సమస్యను ఎదుర్కొన్నప్పుడు ఏవిధంగా ప్రవర్తిస్తూ వచ్చాడో ఇక్కడ మనం తెలుసుకుంటాం. సమూయేలు న్యాయాధిపతిగా ఏలుతూ ఉండగనూ ఇశ్రాయేలీయులు తమకు రాజు కావాలని ఆశించి తమ కోర్కెను సమూయేలుకు చెప్పారు. వారు ఆ విధంగా అడగడం వారికి తప్పు అనిపించలేదేమో కాని, వారు సమూయేలును తిరస్కరించినట్లే కనిపిస్తుంది. అందుకే దేవుడు సమూయేలుతో, ఈ విధంగా చెప్పారు - జనులు నీతో చెప్పిన మాటలన్నిటి ప్రకారము జరిగింపుము, వారు నిన్ను విసర్జింపలేదు కాని, తమ్మును ఏలకుండా నన్నే విసర్జించియున్నారు (1 సమూయేలు 8 : 7). కొద్ది కాలానికి వారు ఆశించినదానిని బట్టి వారే కృంగిపోవల్సివచ్చింది. ఇశ్రాయేలీయులకు రాజు వచ్చిన పిదప సమూయేలుతో పెద్దగా పని లేదు. సమూయేలుకు చెక్‌చేసే

పని. కాని, చెప్పటానికి మాటలు కాని పెద్దగా లేని సమయం. అయినను సమూయేలు తన బాధ్యతను మర్చిపోలేదు అందుకే వారిని గూర్చి ప్రార్థన చేయుటయే బాధ్యతగా ఎంచుకున్నాడు. ప్రజలు ఆశీర్వదించబడాలని, వారు తమ జీవితాలలో దైవిక విలువలతో జీవించాలని, దేవుని ధర్మశాస్త్రాన్ని తూ.చ. తప్పక పాటించాలని వారి నిమిత్తం ప్రార్థన చేశాడు. ప్రార్థన చేయుటయే తన భాగ్యంగా ఎంచుకున్నాడు. ప్రార్థన ద్వారా ఇటు దేవునికి, అటు ప్రజలకు అందుబాటులో ఉన్నాడు. ఎప్పుడైతే ప్రార్థన చేయుటయే తన ప్రాణప్రధంగా ఎంచుకున్నాడో సమూయేలు యొక్క స్థాయి మరింతగా పెరిగింది. రాజును అభిషేకించుట మాత్రమే కాక, రాజును గద్ధించే స్థాయికి వెళ్ళాడు. ప్రజలమీదికి విపత్తు రాకుండా ప్రార్థనతో అడ్డుకట్టలు వేసుకున్నందువల్ల ప్రజలు దేవునికి, సమూయేలుకు భయపడ్డారు. ఎవరైతే ప్రార్థనకు ప్రాధాన్యత ఇస్తారో వారు చేసే ప్రతి పనిలో దైవచిత్తానుసారమైన సమయంలో విజయం తప్పక వస్తుంది. ప్రార్థనకు సమయం ఇచ్చేవారు మాత్రమే ఇటు ప్రజలకు, అటు దేవునికి అందుబాటులో ఉంటారు.

**2. అప్పగించుట (యెహోషువ 24 : 15) :** "మీరెవరిని సేవింపకోరుకొనినను నేనును నా యింటివారును యెహోవాను సేవించెదము అనెను".

మోషే మరణం తర్వాత ఇశ్రాయేలీయులను నడిపించిన గొప్ప నాయకుడే యెహోషువ. యెహోషువ కాలంలోనే ఇశ్రాయేలీయులు వాగ్దాన దేశమైన కనానుకు చేరుకున్నారు. చక్కని నివాసయోగ్యమైన దేశంలో శాంతి, సమాధాన, సంతోషములు, కావలసినంత ధనముతో ప్రజలు నివశించారు. ఎవరిని గూర్చిన భయము, దేవుని గూర్చిన భయము లేదు. శత్రువులను గూర్చిన భయాలు అంతకంటే లేవు. అంతా సజావుగా సాగుతున్న సమయంలో చుట్టూ ఉన్న పరిస్థితులను ఆకళింపు చేసుకున్న యెహోషువ ఇశ్రాయేలీయులను మరింత బలపరచడానికి ప్రోత్సాహకరమైన మాటలతో కొన్ని హెచ్చరికలు కూడా చేశాడు. దేవుని సన్నిధిలో స్థిరంగా నిలబడాలని, దేవుని వాగ్ధానాలు అపరిమితంగా ఉన్నాయని, పితరుల జీవితాలే మనకు మాదిరిగా ఉన్నాయని, మార్గంలో జరిగిన అద్భుతాలు మర్చిపోకూడదనియు, దేవునియందు భయభక్తులు నిలపాలనియు హెచ్చరిక చేశాడు. వారు పొందిన దైవిక స్వాస్థ్యమును కలకాలం నిలబెట్టుకోవాలనే ఆశతో హెచ్చరించాడు. చుట్టూ ఉన్న పోకడలకు లోబడకుండా, ప్రజల ప్రభావాలకు మభ్యపడకుండా వారిని కట్టుదిట్టం చేశాడు. అందుకే వారికి ఒక మాదిరిని చూపిస్తు, నేనును నా యింటివారును యెహోవాను సేవిస్తాము అని తెలియజేశాడు. దేవుడిచ్చిన జీవితాన్ని దేవున్ని సేవిస్తూ, దేవుని సేవలో ఖర్చుచేయుటయే అత్యుత్తమమైన విషయమని, అదియే లెక్కను అప్పగించే పని అని యెహోషువ చెప్పకనే చెప్పాడు. మంచి, చెడు నిర్ణయాలు మనమీదనే ఆధారపడి ఉంటాయి. సత్యాన్ని అనుసరిస్తూ, లోకసంబంధ విగ్రహాలను త్రోసివేస్తూ జీవంకలిగిన దేవున్ని మాత్రమే సేవించాలని యెహోషువ చెప్పిన

మాటలు ఇశ్రాయేలీయుల సమాజములో ఉజ్జీవాన్ని రేకెత్తించింది. అప్పటివరకు యెహోషువ, అతని కుటుంబం మాత్రమే దేవుని సేవను ప్రాణంగా ఎంచుకుంటే, ఇప్పుడు సర్వసమాజము - మేము దేవుని మాటనే వింటాము, దేవునిని మాత్రమే సేవిస్తామని గొప్ప నిర్ణయం తీసుకున్నారు. అందుకేనేమో ఆ యూదాజాతి ఇప్పటివరకు నశించిపోకుండా నిలిచిపోయింది. ప్రియ పాఠకులారా! ఎవరైతే దేవుని సేవ చేయుటయే తమ జీవితమని ఎంచుకుంటారో, జీతభత్యాలు ఆశించకుండా, జీవితం పెట్టి సేవచేస్తారో అలాంటివారు ఎంతైన ధన్యులు. అలాంటి వారిని దేవుడు తప్పక దీవిస్తాడు. అందుకు నిదర్శనమే యెహోషువ.

**3. ఆధిక్యత (ఫిలిప్పీ 1 : 21) :** "నామట్టుకైతే బ్రదుకుట క్రీస్తే. చావైతే లాభము". అపో॥ పౌలు దేవునిచేత ఎంపికైన వ్యక్తి. దేవుని పరిచర్యార్థమై తన్నుతాను సిద్ధంచేసుకున్న గొప్ప వ్యక్తి. ఈ పరిచర్య నిమిత్తం అనేక స్థలాలు తిరుగుతూ, అనేక సంఘాలను స్థాపించాడు. నామట్టుకైతే బ్రతుకుట క్రీస్తే అనే నినాదమే అపో॥ పౌలుకు ఊపిరి. ఈ మాట చెప్పబడుతున్న స్థితిగతులను పరిశీలిస్తే సువార్త నిమిత్తం బంధీ, అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటు, రాళ్ళతో కొట్టబడుతూ ప్రజలను దేవునితట్టు త్రిప్పడానికి అనేక స్థలాలను దర్శిస్తున్న వ్యక్తి. గొప్ప సమర్పణ కలిగి ప్రార్థన యోధుడుగా అనేక శ్రమలను భరిస్తూ ఈ లోకంలో ఉన్న గొప్ప సంగతుల్ని త్రోసివేస్తూ (త్యజిస్తూ) దేవుని కోసం జీవించిన నిస్వార్థపరుడు.

తాను దేవుని కోసం ఉన్న చెరసాలనే సుఖవలయంగా ఎంచుకున్న వ్యక్తి. తనకంటు సంపాదించుకున్న మనుష్యులు కాని, కూడబెట్టుకున్న ఆస్తులుకాని, ఏమి లేవు. ప్రభువు కోసం పోరాటం చేయడమే ఆ యోధుని పని. అందుకే నా మట్టుకైతే బ్రదకడం క్రీస్తే అనే నినాదమే ఆధిక్యతగా ఎంచుకున్నాడు. ఈ లోకంలో మనం ఎంచుకునేది ఏదైన ఒకరోజుకు విడిచిపెట్టవలసి వస్తుందేమోకాని దేవుడు మాత్రం ఎక్కడికి వెళ్ళడు. విశ్వాసంతో పోరాట పటిమతో అద్భుతమైన జీవితాన్ని జీవించాడు. దేవుని కోసం జీవిస్తాం అనడం తేలికే కాని, దేవుని వలే జీవించడం చాలా కష్టం అని సాధించి చూపిన వ్యక్తి అపో॥ పౌలు. క్రీస్తుని ఆరాధిస్తున్న మనము ఏ విషయమును లేక ఏ మనిషిని మన ఆధిక్యతగా ఎంచుకుంటు న్నాము. ఆ ఆధిక్యతలన్ని ఒకరోజు కనుమరుగైపోతాయి. కాని, క్రీస్తు అనే ఆధిక్యత మనకెప్పటికి నిలిచిఉంటుంది. అలాంటి ఆధిక్యతను కలిగిఉన్నవారు మాత్రమే క్రీస్తు కోసం జీవించగలరు లేక క్రీస్తు కోసం చనిపోగలరు. దేవునినే ఆధిక్యతగా ఎంచుకున్న వ్యక్తులకు ఈలోకం గొప్పగా కనిపించదు.

ప్రియ పాఠకులారా! ఈ దేవుడిచ్చిన జీవితాన్ని దేవుని కోసమే ఖర్చుపెట్టాలి. సమూయేలు వలే ప్రార్థన ద్వారా అందుబాటులో ఉంటు, యెహోషువ వలే అప్పగించాలనే భయంతో సేవచేస్తు, పౌలువలే క్రీస్తునే ప్రాణప్రథంగా ఎంచుకునే ఆధిక్యత కలిగి ప్రభువు కొరకు జీవిద్దాం....

**- మరనాత.**

# ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక

## ( 7 వ భాగము )

రెవ. అల్లూరి విశ్వప్రసాద్, విజయవాడ

## పునరుత్థానపు శక్తి :

ప్రభువైన యేసుక్రీస్తు నామములో పాఠకులకు శుభములు, వందనములు.

మన ఆత్మీయ జీవితము విశ్వాసముద్వారా ఆరంభమై మారుమనస్సు, పాపపశ్చాత్తాపము, రక్షణ అనుభవముతో స్థిరపరచబడుతుంది. ప్రభువైనయేసు మనకొరకు సిలువ మరణమునొంది మనలను రక్షించి, స్వస్థపరచి, పునరుత్థానుడై మన జీవితాలకు బలమైన నిరీక్షణను అనుగ్రహించాడు.

ఈ సంచికలో యేసుక్రీస్తు యొక్క అద్వితీయమైన పునరుత్థానపు శక్తిని గురించి ధ్యానం చేద్దాం. ఆ పునరుత్థానపు శక్తి మనలను నడిపిస్తుంది, బలాన్ని, ధైర్యాన్నిస్తుంది. క్రీస్తు యొక్క పునరుత్థానమును గురించిన వేదాంతపరమైన సత్యాలను వ్యతిరేకించేవారు మనచుట్టూ ఉన్నప్పటికి, ప్రభువు జన్మించిన, పాదచారిగా సంచరించి అద్భుతములు చేసిన ప్రదేశములు, సిలువమరణముపొంది, సమాధిచేయబడి, పునరుత్థానుడగుటను గూర్చిన అనేక రుజువులు ఇశ్రాయేలు దేశములో నేటికి ఉనికిలో ఉన్నాయి. ఆయన సమాధిలోలేడు, పునరుత్థానపు శక్తితో తిరిగిలేచాడు అనేదానికి గొప్పనిదర్శనం ఖాళీసమాధి. ఇశ్రాయేలు దేశము వెళ్ళి ఆయా స్థలములను కళ్లారా చూచినప్పుడు అప్పటికే వాటినిగూర్చి విశ్వాసమును కలిగిఉన్నాం కాబట్టి ఎంతో పరవశించాము. నమ్మినవారు నిర్ధారణ చేసుకోనవసరంలేదు. పునరుత్థానము లేనిదే క్రైస్తవ్యము లేదు. దేవుని వాక్యము ఈవిధముగా తెలియజేస్తుంది- ‘‘లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపములనిమిత్తము మృతిపొందెను, సమాధిచేయబడెను, లేఖనముల ప్రకారము మూడవదినమున లేపబడెను’’ (1 కొరింథీ 15 : 1-4). లేఖనములను నమ్మి ప్రార్థించడము మనకెంతో బలాన్ని అనుగ్రహిస్తుంది. ఆ రోజుల్లో కొరింథీ పట్టణము గ్రీకు సామ్రాజ్యపు ఆధిపత్యంలో ఉండేది. గ్రీకులు పునరుత్థానమును నమ్మలేదు. ఏథెన్సులో పౌలు సువార్త ప్రకటిస్తూఉంటే - ‘‘మృతుల పునరుత్థానమునుగూర్చి వారు వినినప్పుడు కొందరు అపహాస్యము చేసిరి. మరికొందరు దీనిగూర్చి నీవు చెప్పునది ఇంకొకసారి విందుమని చెప్పిరి’’ (అపో.కా. 17: 32). ఈదినాల్లో పునరుత్థానమునుగూర్చి వింటున్నప్పుడు మనలోఉన్న విశ్వాసము దానిని నమ్మనివారిలోని అపనమ్మకత్వమును బట్టి అణువంతైనా తగ్గడానికి వీలులేదు. ఎలాంటి ఆటంకాలొచ్చినా, ఎంతమంది అపనమ్మకస్తులెదురైనా మన విశ్వాసాన్ని కాపాడుకొంటూ మనము నమ్మిన నాధుని కోసం ముందుకు సాగిపోవాలి.

మానవ శరీరమును గురించి గ్రీకు తత్వవేత్తలు నమ్మినదేమిటంటే - శరీరమనునది అదొక చెర లేదా బానిసత్వము లాంటిది. మరణము వచ్చి ఆ చెర లేక

బానిసత్వము నుంచి శరీరమును విడిపిస్తుందని నమ్ముతారు. అంతేకాని అట్టి మరణమును యేసుప్రభువు జయించి పునరుత్థానుడయ్యాడని రుజువులు చూపించినా నమ్మరు. సత్యమును నమ్మకుండా అడ్డగించడానికి అపవాది ఎంతో బలమైన ప్రయత్నం చేస్తున్నాడు. ఇక్కడ పౌలుభక్తుడు -''సహోదరులారా, నేను మీకు ప్రకటించిన సువార్తను మీకు తెలియపరచుచున్నాను..'' (1 కొరింథి 15 : 1) అంటూ మూడు ముఖ్యమైన రుజువులు ఇచ్చాడు. అవేమిటంటే - మొదటి రుజువు రక్షణ, రెండవ రుజువు పాత నిబంధన లేఖనాలు, మూడవ రుజువు పునరుత్థానమును చూచినవారి యొక్క సాక్ష్యము మరియు మన ఆత్మీయ అనుభవాలు.

**1. రక్షణ :** పునరుత్థానుడైన యేసును చూచిన పేతురు, తోమా, మిగతా శిష్యులు మరియు విశ్వాసులు అనేకులు బలవంతులయ్యారు. 500 మంది ప్రజలు ఒకచోటనుండగా వారికి కనిపించాడు, ఎమ్మాయి మార్గమున నడిచివెళుతున్న వారితో నడిచి వారి సందేహాలను నివృత్తిచేసాడు. శిష్యులందరికి కనిపించి వారిని ధైర్య పరచాడు. ఈ విధముగా ప్రభువైన యేసు పరలోకమునకు ఆరోహణుడై వెళ్లేముందుగా 40 రోజులు వారినందరిని సిద్ధముచేసాడు. పౌలుభక్తుడు ఫిలిప్పీ సంఘమునకు - ''ఏ విధము చేతనైనను మృతులలోనుండి నాకు పునరుత్థానము కలుగవలెనని ఆయన మరణము విషయములో సమానానుభవము గలవాడనై ఆయనను ఆయన పునరుత్థాన మును ఎరుగు నిమిత్తము..'' (ఫిలిప్పీ 3 : 10) అంటూ వ్రాస్తున్నాడు. యేసుప్రభువు స్వస్థపరచేవాడు, అద్భుతాలు చేసేవాడు అనే విషయాలతో పోల్చితే పునరుత్థానమును గురించిన సంగతులు అన్యజనులకు అర్థంకాకపోయినా, అర్థంచేసుకొన్న మనము పౌలుభక్తుడు తెలిపిన అనుభవములోనికి నడిపించబడాలి. అపజయాలలో ఇస్కరియోతు యూదావలె ఆత్మను నశింపజేసుకోనే స్థితి మనమెన్నడూ తెచ్చుకోకూడదు కాని, అపజయాలలో మనజీవితాన్ని దేవుని సన్నిధిలో సరిచేసుకొని, పునరుత్థాన బలముతో మరణము నుండి తిరిగిలేచిన యేసువలె పాపమనే బలహీనతలోనుంచి తిరిగి లేవాలి, రక్షణపొందాలి.

మనలో ప్రతివారును దేవుని గురించి వ్యక్తిగతముగా ఎరిగియుండి, ఆయన సాన్నిహిత్యములోనికి నడిపించబడాలి. దేవునిని మీరు, మిమ్ములను దేవుడు ఎరిగి యున్నప్పుడు ఎవరు హెచ్చించకపోయినా, గుర్తించకపోయినా, మాట్లాడకపోయినా, నన్ను రక్షించిన పునరుత్థానుడైన ప్రభువు నాతో ఉన్నాడనే విశ్వాసముతో ముందుకు సాగిపోవాలి. పౌలు మార్పుచెందకముంవు (సౌలుగాఉన్నప్పుడు) ధర్మశాస్త్ర నిబంధనలు, ఆచారములు ప్రకారము నడుచుకోవలసివచ్చేది. అప్పుడు క్రైస్తవులకు అతడు హింసకుడుగ, దూషకుడుగ, హానికరుడుగ ఉన్నాడు. అందరూ ద్వేషించారు. కాని ఇప్పుడు పౌలుకు ఒక స్నేహితుడు, యజమానుడు దొరికాడు. ఆయనే పునరుత్థానుడైన యేసుక్రీస్తు. ప్రతిరోజూ తనతో సహవాసంచేసి ఒంటరితనంలోను, అనారోగ్యాలు, బాధలు ఏ స్థితిగతుల లోనైన దేవుడు అతనికి తోడైయున్నాడు. క్రీస్తుయేసు యొక్క పునరుత్థానపు శక్తిని పౌలు జీవితములో

అణువణువులోను నింపుకున్నాడు. యేసుక్రీస్తు పౌలును విడిపించిన అదే రక్తముచేత మనలను విడిపించాడు. ఆయన పునరుత్థానపు శక్తిని మనము కలిగిఉంటే చాలు. యేసుక్రీస్తుయొక్క పునరుత్థానపు బలము, శక్తి నీ జీవితములో ఏంచేస్తుంది? ఎఫెసీ 1 : 15-23 లో పౌలు చెప్పేదేమంటే - క్రీస్తు తిరిగి లేచి, పరలోకానికి ఆరోహణుడై వెళ్ళిన తరువాత ఆయన పునరుత్థానపు శక్తి శిష్యులను రేపింది, బలముగా ప్రేరేపించింది, వాళ్లలో దేవునికొరకు జీవితాన్ని ధారపోయాలనే అంతులేని పౌరుషాన్ని తీసుకొచ్చింది.

"క్రీస్తు లేపబడియుండని యెడల మేము చేయు ప్రకటన వ్యర్థమే, మీ విశ్వాసమును వ్యర్థమే." (1 కొరింథి 15 : 14). పునరుత్థానపు శక్తి అనేది క్రైస్తవ విశ్వాసజీవితానికి గొప్ప పునాది. అదే మన బలం. ఒకవ్యక్తి క్రీస్తు రక్షణను, పునరుత్థానపుశక్తిని ఎరిగియుండికూడ విశ్వాసములో పడిపోయిన స్థితిలోనే జీవించుట చూచినప్పుడు భయం కలుగుతుంది. క్రీస్తు తిరిగి లేవకపోయినట్లయితే క్రైస్తవ విశ్వాసమే లేదు, సువార్తప్రకటన లేదు, రక్షణలేదు, నిరీక్షణలేదు, మనమింకా పాపములోనే ఉండేవారము. మరణించిన మానవులు తిరిగి లేపబడేవారుకాదు. ఐతే, క్రీస్తుయేసు మనలను పాపములనుండి విడిపించి పునరుత్థాన బలాన్నిచ్చాడు. ఆర్భాటముతోను, ప్రధానదూత శబ్దముతోను ప్రభువైన యేసు భూలోకము లోనికి దిగివస్తాడు. అప్పుడు ప్రభువునందు మృతినొందిన మృతులు మొదట లేచుదురు. ఆతరువాత సజీవులమై నిలిచియుండు మనముకూడ మహిమ శరీరులమై లేపబడుదుము. పౌలు దీనిని వివరిస్తూ - "అయితే మృతులేలాగు లేతురు? వారెట్టి శరీరముతో వత్తురని యొకడు అడుగును. ఓ అవివేకీ, నీవు విత్తునది చచ్చితేనే గాని బ్రదికింపబడదు గదా... నీవు వట్టి గింజనే విత్తుచున్నావు గాని పుట్టబోవు శరీరమును విత్తుటలేదు. అయితే దేవుడే తన చిత్తప్రకారము నీవు విత్తినదానికి శరీరము ఇచ్చును. మరియు ప్రతి విత్తనమునకును దాని దాని శరీరము ఇచ్చుచున్నాడు" (1 కొరింథీ 15 : 29-34). కాబట్టి మనము పునరుత్థానమును నమ్మెదము. మనము తిరిగి సజీవులమై మనకంటె ముందుగా మృతులై దేవుని సన్నిధిలో ఉన్నవారిని తిరిగిచూస్తాము. మా అమ్మను మళ్లీచూస్తానని నాకొక ఆశ ఉంది! మనకంటె ముందు చనిపోయి, దేవుని సన్నిధికి వెళ్లిన మనవారిని మహిమ శరీరముతో అక్కడ మనము కలుసుకుంటాం. ఎంత ఆశ్చర్యం !

**పౌలు తీర్మానము :** ఒక విత్తనం భూమిలో పడి చచ్చి ఎలాగు మొలకెత్తుతుందో అలాగే మనం కూడ ఒకానొకరోజున తిరిగి లేస్తాము. ఈ సందర్భంలో మీరు ఏవిషయములో మృతతుల్యమైన స్థితిలోఉన్నారు? ఆలోచనలు, నిర్ణయాలు, ఉద్రేకాలనుండి వచ్చే పాపపు మాటలు క్రియలు, చూపులలోనా? వాటన్నిటిలోనుంచి తిరిగి బ్రతకాలి. "కావలయునంటే నేను శరీరమును ఆస్పదము చేసికొనదలచియెడల నేను మరి ఎక్కువగా చేసికొనవచ్చును" (పిలిప్పీ 3 : 4). తప్పిదాలు చేసుకొంటూపోయే అవకాశాలు మనచుట్టూ ఎన్నో ఉంటాయి. అయినా దేనినీ అవకాశముగా, సుఖముగా నేనెంచుకోను అని ఒక గట్టి తీర్మానము చేసుకున్నాడు అపొస్తలుడైన పౌలు. రోమీయుడుగాను, యూదుడుగాను తనకున్న ద్వి పౌరసత్వమును గూర్చి, మరియు తాను కలిగియున్న అత్యున్నత విద్యార్హతలు, మరెన్నో

ఆధిక్యతలను తెలియచెప్పేవాడు. కాని ఇప్పుడు అదంతా ప్రక్కన పెట్టేసాడు. తనలోఉన్న శరీరసంబంధమైన రోషం, లోకసంబంధమైన అధికారం, అహంకారం అంతా దైవసంబంధ మైన పరిశుద్ధాత్మతో కూడిన ఆవేశముగా మార్చుకొన్నాడు. దేవునికి స్తోత్రం కలుగునుగాక! నీ ఆవేశం ఈరోజున పరిశుద్ధాత్మ ఆత్మావేశమైయుండాలి గాని, అది నీ శరీరానుసారమైన ఆవేశముగా ఉండకూడదు. "నిశ్చయముగా నాప్రభువైన యేసుక్రీస్తునుగూర్చిన అతి శ్రేష్ఠ మైన జ్ఞానము నిమిత్తమై సమస్తమును నష్టముగా ఎంచుకొనుచున్నాను"(ఫిలిప్పీ 3 :8).

**2. పాత నిబంధన లేఖనాలు :** "లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిపొందెను, సమాధి చేయబడెను, లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను" (1 కొరింథి 15 :3,4). "అతని దినములలో యూదా రక్షణనొందును, ఇశ్రాయేలు నిర్భయముగా నివసించును, యెహోవా మనకు నీతియని అతనికి పేరు పెట్టుదురు" (యిర్మియా 23 : 6). ఈవిధముగా దేవునియందు విశ్వాసము ద్వారా వాళ్లు దేవునిని అంగీకరించారు. **వినుటద్వారా విశ్వాసము కలుగును "కాగా వినుట వలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును"** (రోమా 10 : 17). క్రీస్తును గూర్చిన మాట అంటే ఆయన సువార్త. దీనిలో అతి ప్రాముఖ్యమైనది పునరుత్థానపు శక్తి. "యేసు ప్రభువని నీనోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించినయెడల, నీవు రక్షింపబడుదువు. ఏలయనగా నీతి కలుగు నట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును" (రోమా 10 : 9).

**3. పునరుత్థానమును చూచినవారి సాక్ష్యము :** "ఈ యేసును దేవుడు లేపెను; దీనికి మేమందరము సాక్షులము. కాగా ఆయన దేవుని కుడిపార్శ్వమునకు హెచ్చింపబడి, పరిశుద్ధాత్మను గూర్చిన వాగ్దానమును తండ్రివలన పొంది, మీరు చూచుచు వినుచునున్న దీనిని కుమ్మరించి యున్నాడు"(అపో॥ కా॥ 2 : 32,33). దేవుడు ఆయన కుమారుని లేపెను. జనులు మనలను నిందించినా, పడద్రోసినా ఈ దేవుడు మనలను లేపి, పైకిలేవనెత్తి మరల ఉన్నత స్థలములకు నడిపించు దేవుడైయున్నాడు. ఆ పునరుత్థాన శక్తి మీకు ధైర్యాన్ని, విశ్వాసాన్ని, బలాన్నిస్తుంది, మీ నోట సాక్ష్యమును పలికిస్తుంది, మిమ్మును నడిపిస్తుంది, మీకు విలువను తీసుకువస్తుంది. "ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదు గాని, ముష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి (2 పేతురు 1 : 21). "అంధకారములో నుండి వెలుగు ప్రకాశించును గాక అని పలికిన దేవుడే తన మహిమను గూర్చిన జ్ఞానము యేసుక్రీస్తునందు వెల్లడిపరచుటకు మా హృదయములలో ప్రకాశించెను. గనుక మేము మమ్మును గూర్చి ప్రకటించుకొనుటలేదు గాని, క్రీస్తుయేసును గూర్చి - ఆయన ప్రభు వనియు, మమ్మును గూర్చి - యేసు నిమిత్తము మేము మీ పరిచారకులమనియు ప్రకటించుచున్నాము" (2 కొరింథీ 4 : 5). ఎందుకు ప్రకటిస్తున్నాము అంటే యేసుక్రీస్తు

తిరిగి లేచాడు! . ఈవిధంగా మరణించి తిరిగిలేచినవారు భూలోకములో ఎవరూ లేరు. మనకున్న జ్ఞానాన్నంతా ప్రక్కనపెడితే దేవుడు తన ఆలోచనలు, జ్ఞానాన్నిచ్చి నడిపిస్తాడు. పెంతెకోస్తుదినాన ఆరంభమైన బలమైన పునరుత్థానపు శక్తి ప్రపంచ మంతటికి అద్భుతమైన సందేశము. "అపోస్తలులు బహుబలముగా ప్రభువైన యేసు పునరుత్థానము నుగూర్చి సాక్ష్యమిచ్చిరి. దైవకృప అందరియందు అధికముగా ఉండెను"(అ.కా. 4 : 33).

ఆది అపొస్తలుల సంఘమును నాశనంచెయ్యాలని, సంఘము ముందుకు కొనసాగకూడదని అపవాది వెలుపలనుంచి వ్యతిరేకతలను, ఆటంకాలను సంఘముమీదికి తీసుకురావడానికి ప్రయత్నం చేసాడు. పేతురువంటి వాళ్లు ధైర్యంగా నిలబడి సువార్తను ప్రకటించి, సంఘాన్ని ధైర్యపరచి పునరుత్థానబలంతో సంఘాన్ని నడిపిస్తూఉండగా, అపవాది సంఘము లోపలివారిని అనగా సంఘ పరిచర్యలోను, సహవాసములోను అన్ని విధాలుగా సహకారులుగా ఉండే విశ్వాసులను బలహీనతల్లో పడవేయడం మొదలుపెట్టాడు. ఎన్ని ఆయుధాలు సైతాను ప్రయోగించినప్పటికి వారి బలహీనతల నుండి ప్రభువు యొక్క పునరుత్థానశక్తి ద్వారా బలముపొందారు.

**"నిబ్బరమైన బుద్ధి గలవారై మెలకువగా ఉండుడి; మీ విరోధియైన అపవాది గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు"**(1 పేతురు 5 : 8). మరియు, **"సర్పము తన కుయుక్తిచేత అవ్వను మోసపరచినట్లు మీ మనస్సులును చెరుపబడి, క్రీస్తు ఎడలనున్న సరళత నుండియు పవిత్రత నుండియు ఎట్లయినను తొలగిపోవునేమో అని భయపడు చున్నాను"** (2 కొరింథి 11 : 3). సైతాను గురి ఎప్పుడూ దేవుని సంఘముపైనే. సంఘము బయటనుంచి, లోపలినుంచి మనకు వ్యతిరేకతలు రావచ్చు. ఎన్నో రీతులుగా అపవాది మనమీదకు దాడిచేసి, మనలను నష్టపరచడానికి ప్రయత్నంచేస్తాడు. ఆదిమ సంఘ విశ్వాసులందరూ వారు ఏకమనస్సుతో, ఏకభావముతో ఉండి గొప్పకార్యాలను చేసారు. "విశ్వసించినవారందరు ఏకముగా కూడి తమకు కలిగినదంతయు సమిష్టిగా ఉంచుకొనిరి. "వారేకమనస్కులై ప్రతిదినము దేవాలయములో తప్పక కూడుకొనుచు, ఇంటింట రొట్టె విరుచుచు, దేవుని స్తుతించుచు, ప్రజలందరివలన దయపొందినవారై.." (అపో॥ కా॥ 2 : 44-46). విశ్వాసులందరూ ఐక్యంగా ఉంటూ దేవునికి ఇచ్చేవిషయములో దాతృత్వంకలిగి, సువార్తను ప్రకటిస్తూ, దేవుని సేవ బలంగా విస్తరింపచేయుటలో చాలా ఐక్యతతో ముందుకెళ్లారు. ఈదినాలలో సంఘములో వ్యతిరేక పరిస్థితులు మనకు ఎదురైనప్పుడు ఆనాటి శిష్యులను బలపరచిన అదే పునరుత్థాన బలంతో ముందుకు సాగిపోదాం.

**ఒక రాకెట్‌ను అంతరిక్షములోనికి పంపించినప్పుడు అది పైకి దూసుకు వెళ్లునట్లు అగ్ని ఎలా పనిచేస్తుందో అదేవిధంగా దేవుని వాక్కు పరిశుద్ధాగ్నితో దూసుకొని వెలుతుంది. మొదటి శతాబ్దపు సంఘము ఆ పునరుత్థానపు శక్తిని పొందుకొని సాక్షులుగా జీవించినట్లుగా అట్టి అపరిమితమైన శక్తితో మనలను దేవుడు నడిపించును గాక. ఆమెన్! - మరనాత.**

**( సశేషం )**

# హెబ్రీపత్రిక ధ్యానములు - 38

**రెవ. గొట్టిపాటి యేసుదాసు, రేపల్లె**

ప్రియమైన మరనాత మెసేంజర్ పాఠక మిత్రులకు ప్రభువు నామములో నూతనవత్సర శుభములు.

మన ధ్యానములలో, హెబ్రీ 13 : 7-13 భాగాన్ని పరిశీలించుదాము. “మీకు దేవుని వాక్యమును బోధించి, మీపైని నాయకులుగా ఉన్నవారిని జ్ఞాపకము చేసుకొని, వారి ప్రవర్తన ఫలమును శ్రద్ధగా తలంచుకొనుచూ, వారి విశ్వాసమును అనుసరించుడి. యేసు క్రీస్తు నిన్న నేడు ఒక్కటేరీతిగా ఉన్నాడు. అవును యుగయుగములకు ఒక్కటే రీతిగా ఉండును. నానావిధములైన అన్య బోధలచేత త్రిప్పబడకుడి. భోజనపదార్ధములను బట్టి కాక, కృపనుబట్టియే హృదయము స్థిరపరచుకొనుట మంచిది; భోజనమునుబట్టి ప్రవర్తించు వారికి ఏమియు ప్రయోజనము కలుగలేదు. ‘మనకొక బలిపీఠమున్నది; దాని సంబంధమైన వాటిని తినుటకు గుడారములో సేవచేయువారికి అధికారము లేదు. వేటరక్తము పాపపరిహారార్ధముగా పరిశుద్ధ స్థలములోనికి ప్రధానయాజకునిచేత తేబడునో, ఆ జంతువుల కళేబరములు శిబిరమునకు వెలుపట దహింపబడును. కావున ఏసు కూడ తన స్వరక్తము చేత ప్రజలను పరిశుద్ధపరచుటకై గవిని వెలుపట శ్రమపొందెను.

**నాయకులు :-** వాక్యమును బోధించి రక్షణలోనికి నడిపించిన నాయకులను జ్ఞాపకము చేసికొని, వారిద్వారా కల్గిన మేలులు, ఉపకారాలనుబట్టి వారిని గౌరవిస్తూ, ఆ మంచి మార్గములో నడవమంటున్నాడు పౌలుగారు. అవును 1 కొరింథి 4 : 16లో సువార్త ద్వారా నేను మిమ్ములను కన్నాను, నన్ను పోలి నడుచుకోండి అంటున్నాడు. ఏ దైవదాసుని ప్రయాసతో మేలుపొందారో, వారు గొప్పవారై, విడిచిపోయి, నిందలేస్తున్నవారికి గ్రహింపు కల్గించాలని ప్రార్ధించాలి. నూతన వత్సరములో మనలోని వంకరలను గ్రహించుకుందాము. స్వఛ్ఛంద సంఘస్థాపనలో నడిపించుటలో ప్రయాసపడువారి శ్రమను గ్రహించి సహకరించాలి. “వంకర త్రోవలకు తొలగువారిని దేవుడు పాపులతో వెంటబెట్టుకొని వస్తాడు (కీర్తన 125 : 5). బోధకులు, విశ్వాసులు మారినా క్రీస్తు పవిత్రరక్షణలో ప్రేమలో శాశ్వతముగా నిలిచిఉంటాడు.

**అన్యబోధలు :-** రక్షణ పొందిన యూదులలో కొందరు, గత మతాచారములనుబట్టి వాదాలుపెట్టుకునేవారు. సున్నతి పొందుట, బల్యర్పణలు, నైవేద్యాలతో కలిపి ప్రార్ధించుదాము అనేవారు. నేటి క్రైస్తవులు కొందరు తిథి నక్షత్రాలు చూచి వివాహాలు, గృహప్రవేశాలు చేస్తున్నారు. గలతీ 2 : 11-16 భాగంలో ఇలాంటి ఆచారాలతో ఏకీభవించిన పేతురును పౌలు ఖండించినట్లు మనం చదవగలము. ధర్మశాస్త్ర క్రియలమూలంగా కాక, విశ్వాస మూలముగానే నీతిమంతులమౌతామని నొక్కిచెప్పాడు. రక్షణ, బాప్తిస్మము, సంస్కారము

అక్కర్లేదు, కేవలము నమ్ముకుంటే చాలనేవారు పుట్టుకొచ్చారు. సంస్కరణ లేనప్పుడు సంస్మరణ ఎందుకు? నేటి సంఘాలకు సువార్త కంటే ఆచారాలనుండి సంస్కరణ కావాలి. నాటి సంఘాలు ప్రభువుభోజనము పేర భోజనాలు వండుకుని తోటలోనికి వెళ్ళి తినేవారు. అన్యులడిగితే మాప్రభువు రక్తమాంసాలు తినివస్తున్నాము అనేవారు. అందుకు వారికి నరమాంస భక్షకులని అన్యులు పేరుపెట్టారు. అందుకే భోజనానికి ప్రాధాన్యతనిచ్చిన వారికి ఏమేలు కలుగలేదు అంటున్నాడు పౌలుగారు.

**బలిపీఠము :-** పాతనిబంధనలో ఆది 8 : 20 ప్రకారము జలప్రళయానంతరము నోవహు మొదటిగాకట్టిన బలిపీఠం దగ్గరనుండి ఆరంభమై బలిపీఠాల ఆరాధన కొనసాగింది. అయితే క్రీస్తు సిలువలో రక్తతర్పణం చేసినతరువాత బలిపీఠాలపై జంతుబలిఅర్పణ ఆగిపోయింది. పౌలు చెప్పున్న హెబ్రీ 13 : 10 లోని బలిపీఠము సిలువలో క్రీస్తు చేసిన బలియాగమే. యూదమతవ్యవస్థను ఆచరిస్తూ, క్రీస్తు క్రొత్తనిబంధన రక్షణయజ్ఞాన్ని తిరస్కరించేవారికి క్రీస్తు "బలిపీఠము"లో పాలులేదు. అందుకే ఆచార ఖర్మకాండలలో మునిగితేలుచూ, వాటిని ఖండించి, ఆత్మారాధన కొనసాగించలేనివారికి క్రీస్తు నూతన నిబంధనలో అధికారము లేదు అంటున్నాడు పౌలుభక్తుడు. పాత నిబంధన బలిపీఠాలపై అర్పించబడిన జంతుకళేబరాలు గుడారము (శిబిరము) వెలుపల దహించబడేవి. అలాగే యేసు తన ప్రజలను పరిశుద్ధపరచుటకై గవినివెలుపల శ్రమపొందాడు (లేవీ 16 : 27 ప్రకారం పాపపరిహారార్ధ బలిపశువులను పాళెము వెలుపల దహించాలి. వాటిని ఎవరూ తినరాదు. అలాగే యేసు శరీరాన్ని ఎవరూ తినలేరు. ఆయన రక్త మాంసాల సంకేతమైన రొట్టె, ద్రాక్షరసాన్ని మనము తిని, త్రాగుతున్నాము. కాబట్టి మనమాయన నిమిత్తము అవమానాలు భరిస్తూ, లోకము, మతాచారాలు అను శిబిరము వెలుపలనున్న ఆత్మ సంబంధమైన సిలువబలిపీఠము దగ్గరకు వెళ్తాము. అక్కడే ఆత్మీయ బలము పుంజుకుందాము.

**ఏలియా కట్టించిన బలిపీఠము :-** అది ఆహాబు, యెజెబెలు అను రాజదంపతులు ఇశ్రాయేలును పాలించుచున్న కాలము. ఈ దంపతులు బహుదుష్టులు. దేవుడు వీరికెందుకు రాజ్యాధికారమిచ్చాడు? అని ఎవరైనా అడిగితే ! నేటి సంఘవిద్రోహులకు, దేశద్రోహులకు, బలిసిన జలగలవంటివార్కి దేవుడు క్షేమాన్ని, అధికారాన్ని ఇచ్చి వారిలో మార్పుకై చూస్తున్నట్లే వారికి కూడ ఒక అవకాశమిచ్చాడు. సర్వపాపాల వ్యక్తులకు క్షేమాన్ని ఎందుకిస్తున్నట్లు? వారు నీతిమంతులని కాదు. వారు నాశనమైతే రక్షణపొందే అవకాశముండదని బ్రతికించి పోషిస్తున్నాడు. దుష్టుల క్షేమానికి రెండు కారణాలు - 1) దేవుని మహా దీర్ఘశాంతము, 2) నిజమైన భక్తుల నిరీక్షణతో కూడిన ప్రార్ధనాబలము. ఆహాబు రాజేగానీ యెజెబెలు రాణిగారి ఆడపెత్తనం ఆమె విగ్రహారాధన మక్కువగలస్త్రీ. 450 మంది బయలు దేవత ప్రవక్తలను 400 మంది అషేరాదేవత ప్రవక్తలను దేవుని

ధనాగారపు సొమ్ముతో పెంచిపోషిస్తుంది. యెహోవా నామమును ఆరాధించాల్సిన దేశంలో విగ్రహారాధన విస్తరింపజేసిందన్నమాట. అప్పుడు దేవుడు ఏలియాను ప్రేరేపించాడు. ఆ 850 మంది ప్రవక్తలను కర్మెలు పర్వతానికి పిలిపించి, "ఎన్నాళ్ళమట్టుకు మీరు రెండు తలంపులమధ్య తడబడుదురు? యెహోవా దేవుడైతే ఆయనను అనుసరించుడి, బయలు దేవుడైతే వానిననుసరించుడని" ప్రకటన చేశాడు (1 రాజులు 18 : 21).

ఏలియాకు ఈ బొమ్మల ఆరాధన ఇష్టములేదని ఎరిగిన ఆహాబు "ఇశ్రాయేలువారిని శ్రమపెట్టువాడవు నీవేకదా అన్నాడు. అందుకు ఏలియా - నేను కాదు, యెహోవా ఆజ్ఞలను గైకొనక బయలుదేవత ననుసరించు నీవును, నీ తండ్రి ఇంటివారును ఇశ్రాయేలువారిని శ్రమపెట్టువారై యున్నారని బాహాబాహీగా ఎదుర్కొన్నాడు (1 రాజులు 18 : 16-18). అవును దేశాన్ని, ప్రజలను శ్రమలపాలు, శాపగ్రస్తముగా చేసేవారు పాపులు, పాపప్రేరిత పాలనాధికారులే గానీ, పాపాన్ని ఖండించి పశ్చాత్తాపాన్ని ప్రకటించే దైవదాసులు కాదు. కర్మేలుగిరి మధ్యధరాసముద్ర తీరంవరకు వ్యాపించియున్న పర్వతశ్రేణి. ఇశ్రాయేలు ప్రజలకు దేవుడిచ్చిన సంపదను, మానవ హస్తకృత బొమ్మారాధనచేయు అబద్ధప్రవక్తలకు యెజెబెలు ధారపోస్తుంది. ఎవరు నిజ దేవుడు? అని తెలుసుకుని ఆరాధించుటకు నిర్ణయించుకునే కాలం వచ్చింది. రోడ్లన్నీ రోముకే అన్నట్లు మతాలన్నీ మంచివే, దేవుళ్ళంతా ఒకటే అంటారు. పాపాన్ని విడిచి, పరిశుద్ధతలో నిలబడలేని క్రైస్తవులనబడే కొందరు ఈ వాదాన్ని సమర్థిస్తారు. నిజదేవుని ఆరాధించాలంటే నకిలీలను విడిచి స'జీవుని కొరకు నిలబడాలి, నిరూపించాలిగదా !

**ఒక నిర్ణయం :-** చెరొక ఎద్దు బలిపీఠముపై ఒక్కొక్కరు ఒక ఎద్దును వధించి, కట్టెలపై పేర్చి ప్రార్థిస్తే ఏదేవుడు కట్టెలను తగులబెట్టుటద్వారా ప్రత్యుత్తరమిస్తాడో ఆయనే దేవుడని నిశ్చయించారు. మీరు ఎక్కువమంది గనుక ముందు మీరే ప్రయత్నించండి అన్నాడు ఏలియా. అన్నివిధాలా వారి యత్నాలు విఫలమై జవాబురాలేదు. తాను ఒంటరివాడనని, తన పక్షముగా దేవుడున్నాడని ఏలియాకు తెలుసు. అందరిముందు అబద్ధమతానికి ఎదురు నిలుచుట ఏలియా సాహసము. వారిని, వారి దేవతలను ఏలియా గేలిచేయుటలో దేవుని యందున్న ధైర్యము, నిబ్బరము కన్పిస్తున్నాయి. అధైర్యవంతులపట్ల దేవుడు సాహసకార్యాలు చేయలేడు. "వారందర్నీ ఏలియా కూడబిలిచి, క్రిందపడద్రోయబడియున్న యెహోవా బలిపీఠాన్ని బాగుచేసి, నీనామము ఇశ్రాయేలగునని వాగ్దానమునొందిన యాకోబు సంతతి గోత్రముల లెక్కచొప్పున పండ్రెండు రాళ్ళను తీసుకొని, ఆరాళ్ళచేత యెహోవా నామమున ఒక (క్రొత్త) బలిపీఠము కట్టించి, కందకము త్రవ్వించి, కట్టెలు క్రమముగాపేర్చి, ఎద్దు మాంసము కట్టెలపై ఉంచి, ముమ్మారు నీళ్ళుపొర్లునట్లు నింపి, అస్తమయ నైవేద్య సమయాన ఏలియా ప్రార్థించుచుండగా, యెహోవా అగ్ని దిగి, దహనబలిపశువును కట్టెలను రాళ్ళను, బుగ్గిని దహించి, కందకమందున్న నీళ్ళను ఆరిపోజేసెను(1 రాజులు 18 : 30-38).

**నూతనత్వము :-** పాత బలిపీఠాన్ని దేవునికయిష్టమైన ఆచారఖర్మకాండల ఒరవడిని పడద్రోసి బాగుచేసి, ఆత్మ, సత్యముతో ఆరాధించే ఆత్మీయసమర్పణా బలిపీఠాన్ని మన హృదయాలలో నూతనముగా నిర్మించినపుడే హెబ్రీ 12 : 29 ప్రకారము దహించు అగ్నియై యున్న దేవుడు దిగివచ్చి అన్యులమధ్య ధన్యకరమైన అద్భుతాలు చేస్తాడు. శుభకరమైన ఆనవాలు నాకు చూపించు, నేను నిన్నెరుగనివారికి ప్రకటిస్తాను అంటాడు దావీదు. దేవుడు అసహ్యించుకునే శుద్ధిచేయబడని బలిపీఠాలపై, వ్యర్థమైన నైవేద్యాలు ఇంకెంతకాలము అర్పించుదాము? ఫలితంలేని పనిలో కాలము వెళ్ళబుచ్చుదామా? ఎదుగుదలలేని మరుగుజ్జులుగానే ఉందామా? రోషంగల ఏలియావైపు చూస్తూ ఆలోచించుదాము.

**అద్భుతము :-** నిజదేవునికి మొరపెట్టగల్గియుండియు, జవాబివ్వలేని దేవతలకు శివమెత్తి నట్లు కేకలుపెట్టడం శోచనీయము. ఇది సత్యదేవుని ఆరాధన నిర్లక్ష్యానికి గురైందనడానికి నిదర్శనము. తన జీవితం, పరిచర్య, విశ్వాసము ఇశ్రాయేలు దేవుడైన యెహోవాకు చెందినది అని అందరికి తెలియాలనేది ఏలియా ఉద్దేశ్యము. జరగబోయే అద్భుతము అందరిముందు వాస్తవము కావాలి అనేది ఏలియా నిరీక్షణ. కపటప్రవక్తల సుదీర్ఘ గగ్గోలుప్రార్ధనకు, నమ్మకం తో చేసిన ఏలియా చిన్న ప్రార్థనకు వ్యత్యాసాన్ని దేవుడు చూపించాడు. నిర్గమ 9 : 16 లో నా బలమును నీవు చూపునట్లును, భూలోకమంతట నా నామమును ప్రచురము చేయు నట్లును, ఇందుకే నేను నిన్ను నియమించితిని అని మోషేతో దేవుడు చెప్పాడు. యెహోషువ 4 : 24 లో మీరు ఎల్లప్పుడును మీదేవుడైన యెహోవా యందు భయభక్తులు నిలుపుటకును, మేము దాటువరకు మీదేవుడైన యెహోవా తానే మాయెదుట ఎర్రసముద్రమును ఎండజేసి నట్లు, మీరు దాటువరకు మీఎదుట యొర్దాను నీళ్ళను ఎండజేసెనని చెప్పి ఈ సంగతి వారికి తెలియపరచవలెనని యెహోషువతో దేవుడు చెప్పుట గమనార్హము.

**దేవునికే మహిమ :-** ప్రజల ముందు ప్రదర్శన కాదు, నిజదేవుని అందరూ గుర్తించాలని ఏలియా మనోభావము. విధేయత, సమర్పణగల నమ్మకస్తుల ద్వారా తనను అన్యులలోనికి వెల్లడించుకోవాలనే దేవుని ఉద్దేశ్యాన్ని చూస్తున్నాము. ఈపోటీలోని ఏలియా రోషం దేవుని ఉద్దేశ్యం నెరవేరాయి. ‘‘అంతట జనులందరూ దానిచూచి సాగిలపడి, యెహోవాయే దేవుడు, యెహోవాయే దేవుడని కేకలువేసిరి(1 రాజులు 18 : 39). దేవుని ఎరుగనివారిలో నుండి ఈకేకలే నేడు రావాలి. ప్రజలలో నిద్రాణమైయున్న ఆత్మీయనిద్ర లేవాలి. వ్యతిరేకుల లోని అనేకులు ప్రభువు ముందు తలవంచాలి. ‘‘రక్షింపబడి సాక్షులుగా నిలవాలి. ఆర్భాటాలు, ఆచారాల పులిపిండి బలిపీఠాన్ని తీసివేసి, బాగుచేసి, అగ్నిదిగుటకు అవకాశ మున్న ఆత్మీయ బలిపీఠాన్ని క్రొత్తగా కడదాము. అన్యులనుండి అనేకుల రక్షణ కేకలు విందాము. మన దేవుని ఆశలు నెరవేర్చుటకై 2019 నూతన సంవత్సరములో రోషంగల ఏలియావలే’’ కార్యసిద్ధికై కన్నీటిప్రార్థన చేద్దాము. నూతన కృపాకార్యాలతో దేవుడు మన కుటుంబాలను, సంఘాలను నింపును గాక!! **- మరనాత.** **( సశేషం )**

# వార్తల్లో కొన్ని ...

## మన మేను.. మధుమేహాన్ని మాన్పు !

**లండన్, జనవరి 7 :** మన శరీరంలో కోటానుకోట్ల కణాలు.. సాంకేతికత గొప్పగా అభివృద్ధి చెందినా వాటన్నింటిపై మనకు పూర్తి అవగాహన లేదు. ఇంకా ఎన్నో అంతుచిక్కని కణాలు శరీర వ్యవస్థ లో దాగుడుమూతలు ఆడుతున్నాయి. వాటి లోంచి కొన్ని కణాలను నార్వేలోని యూనివర్సిటీ ఆఫ్ బెర్గెన్ శాస్త్రవేత్తలు గుర్తించారు. అవి ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే పాడైన కణాలను తమ ఆధీనంలోకి తీసుకుంటాయట. అంటే.. ఇన్సులిన్ ఉత్పత్తికి ఆటంకం కలుగకుండా చేస్తాయన్నమాట. క్లోమంలో ఈ కణాలు గ్లూకాగాన్‌ను ఉత్పత్తి చేస్తాయని, వీటి పని తీరును విశ్లేషించి భవిష్యత్తులో మధుమేహ వ్యాధికి కొత్త చికిత్స రూపొందించవచ్చని పరిశోధకులు తెలిపారు.

## గుడ్డుతో మధుమేహం దూరం!

**లండన్, జనవరి 6 :** గుడ్డు ఆరోగ్యానికి చాలా మంచిదన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే.. రోజు ఒక గుడ్డు తీసుకుంటే టైప్-2 మధుమేహం వచ్చే ప్రమాదం తక్కువగా ఉంటుందని యూనివర్సిటీ ఆఫ్ ఈస్టెర్న్ ఫిన్లాండ్ శాస్త్రవేత్తల అధ్యయనంలో తేలింది. పరిశోధనల్లో భాగంగా 296 మంది రక్త నమూనాలు పరిశీలించారు. వారానికి రెండు గుడ్లు తినేవారితో పోలిస్తే.. రోజూ ఒక గుడ్డు తినేవారికి టైప్-2 మధుమేహం వచ్చే అవకాశాలు తక్కువని వారు కనుగొన్నారు.

## మంట పుట్టని ఆహారంతో దీర్ఘాయుషు

**వాషింగ్టన్, జనవరి 7 :** ఆరోగ్యంగా ఉండేందుకు చాలామంది రకరకాల వ్యాయామాలు చేస్తుంటారు. ఆహారపు అలవాట్లను పాటిస్తుంటారు. అయితే, కడుపులో మంట పుట్టనివ్వని పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు వంటి ఆహారాన్ని అధికంగా తీసుకోవడంవల్ల ఎక్కువ కాలం ఆరోగ్యంగా జీవించవచ్చని తాజా అధ్యయనంలో తేలింది. 68,273 మందిపై పరిశోధన జరిపిన పోలాండ్‌లోని వార్సా వర్సిటీ ఆఫ్ లైఫ్ సైన్సెస్ పరిశోధకులు ఈ విషయాన్ని గుర్తించారు. ఈ శోధ నిరోధక ఆహారాన్ని తీసుకోవడంతోపాటు ఉప్పు, సంతృప్త కొవ్వులు తక్కువగా తీసుకోవడంవల్ల కేన్సర్‌వచ్చే ముప్పు 13%, హృద్రోగాల ముప్పు 20% తగ్గిందని పరిశోధకులు తెలిపారు.

## ఆ కలెక్టర్ అందరికీ స్ఫూర్తి!

### కుమార్తెను రోజూ అంగన్‌వాడీకి పంపిస్తున్న కలెక్టర్

**చెన్నై, జనవరి 10 :** ప్రభుత్వ ఉన్నతాధికారులు, రాజకీయ ప్రముఖులే కాదు.. సాధారణ ప్రజలు సైతం ఈరోజుల్లో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపేందుకు ఇష్టపడడం లేదు. హోదాకు తగ్గట్టు కార్పొరేట్ స్కూల్స్, కాలేజీల్లోనే చదివిస్తున్నారు. కానీ.. తమిళనాడు లోని తిరునల్వేలిజిల్లా కలెక్టర్ శిల్పా ప్రభాకర్ సతీశ్ తన కుమార్తెను అంగన్‌వాడీ కేంద్రంలో చదివిస్తూ అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. ఆ జిల్లాకు తొలి మహిళా కలెక్టర్‌గా నియమితమైన శిల్పకి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె తన కుమార్తె గీతాంజలి(3)ని స్థానిక అంగన్ వాడీ కేంద్రంలో చేర్చారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ -"ఈ అంగన్ వాడీ కేంద్రంలో ప్రైవేటు కాన్వెంట్లస్థాయి సదుపాయాలు ఉన్నాయి, పిల్లలకు మంచి పాఠాలు బోధిస్తు న్నారు. పరిశుభ్రమైన వాతా వరణం, ఆటపాట లకు నెలవుగా ఉన్న అంగన్‌వాడీకి కుమార్తెను పంపడం సంతోషంగా ఉంది" అని అన్నారు. కాగా.. ఆ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 'యోక్' అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో 8 నుంచి పదేళ్లలోపు వారికి ఆంగ్ల పాఠాలు బోధించే సదుపాయాన్ని శిల్పా కల్పించారు.




-: ప్రతుల కొరకు :-

విజయవాడ - 89777 61512; 0866- 2480047

హైదరాబాద్ - 99896 98072

విశాఖపట్నం - 94405 74118

R.N.I.No.66564/83 Regn.No.VJ/023/2018-2020
Posted at BPC, Krishna Lanka, VIJAYAWADA - 520 013.
Printed on 08-02-19 No. of pages 28 Posting date : 9th & 10 of every month

మరనాత విశ్వాస సమాజము సమర్పించు

# మరనాత దర్శనం

## ఆధ్యాత్మిక టీ.వీ. కార్యక్రమములు

దైవదాసులు శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి,

దైవదాసులు శ్రీమతి & శ్రీ అల్లూరి విశ్వప్రసాద్

దైవదాసులు డా॥ నిరీక్షణ కంచర్ల గార్లు

ఆధ్యాత్మిక వర్తమానములు అందించెదరు.

## కల్వరి ఛానల్‌లో

Calvary TV

బుధవారం రాత్రి 8 - 8 : 30 గంటల వరకు

శుక్రవారం ఉదయం 6:30 - 7 గంటల వరకు

శనివారం రాత్రి 7 - 7 : 30 గంటల వరకు

## ఆరాధన ఛానల్‌లో

ఆరాధన ARADHANA

గురువారం ఉదయం 7 - 7 :30 గంటల వరకు

## శుభవార్త ఛానల్‌లో

SUBHAVAARTHA TELEVISION

సోమవారం మధ్యాహ్నం 1 :30 - 2 వరకు

శుక్రవారం రాత్రి 9 :30 - 10 గంటల వరకు